# భగవద్గీత
# పదునైదవ అధ్యాయము
# పురుషోత్తమ ప్రాప్తియోగము



పరమాత్మ మనకు విభూతి యోగంలో తన యొక్క విభూతులు ఏ యే పదార్థాలలో, జీవరాసులలో ముఖ్యంగా నిండి ఉన్నాయో చెప్పాడు. వాటిని దృశ్యరూపంగా విశ్వరూపంలో చూపించాడు. అప్పుడు అర్జునుడికి జ్ఞానోదయం అయింది. కృష్ణుడిని పరమాత్మగా అంగీకరించాడు. ఇప్పుడు అసలు విషయం మొదలుపెట్టాడు కృష్ణుడు, ముందు భక్తి గురించి చెప్పాడు. తరువాతప్రకృతి, పురుషుడు అంటే క్షేతము, క్షేత్రజ్ఞుడు వీరి గురించి చెప్పాడు. క్షేత్రములో పుట్టిన జీవుడు తనస్స్వరూపము అంటే ఆత్మ స్వరూపమును తెలుసుకొని పరమాత్మలో చేరడానికి మార్గం గురించిచెప్పాడు. కాని ఆ మార్గంలో ఉన్న అడ్డంకులు అంటే మూడు గుణముల గురించి చెప్పాడు. ఈమూడు గుణముల అడ్డు తొలగి పోగానే జరిగేది పురుషోత్తమ ప్రాప్తి, అంటే పరమాత్మలో ఐక్యంకావడం దాని గురించి ఈ అధ్యాయంలో చెబుతున్నాడు.

ఈ అధ్యాయంతో భగవద్గీత పూర్తి అవుతుంది. అందుకే ఈ అధ్యాయం ఆఖరుశ్లోకం అయిన 20 వ శ్లోకంలో ' అర్జునా! అతి గుహ్యమైన ఈ శాస్త్రమును నీకు చక్కగా బోధించాను. దీనిని బాగా తెలుసుకున్న వాడు జ్ఞానవంతుడు, కృతకృత్యుడు అవుతాడు." అని అన్నాడు. కాని దానితరువాత 16, 17, 18 అధ్యాయములలో ఇప్పటి వరకు చెప్పబడిన అంశముల యొక్క వివరణలనుఇచ్చాడు. దేవతలు, అసురులు వారి యొక్క గుణములు గురించి చెప్పాడు. మనం ప్రతి పనీ శ్రద్ధతోచేయాలని చెప్పాడు ఆ శ్రద్ధలలో రకాలైన సాత్వక, రాజసిక ,తామసిక శ్రద్ధల గురించి చెప్పాడు. ఆఖరు అధ్యాయంలో సన్యాసము, మోక్షము వీటి గురించి చెప్పాడు. సన్యాసము అంటే కర్మలనుపరమాత్మకు అర్పించడం. దాని ద్వారా మోక్షమును పొందడం. ఈ అధ్యాయంతో భగవద్గీతముగుస్తుంది. ఇంక ఈ పురుషోత్తమ ప్రాప్తియోగంలోకి ప్రవేశిద్దాము. ఈ అధ్యాయం మొదటిరెండు శ్లోకాలలో సంసారము, దాని లక్షణాలు గురించి వివరించాడు.

శ్రీభగవానువాచ

1. ఇదం తు తే గుహ్యతమం ప్రవక్ష్యామ్యనసూయవే |
జ్ఞానం విజ్ఞానసహితం యజ్జ్ఞాత్వా మోక్ష్యసేఽశుభాత్ || ||

వేళ్లు పైకి, ఆకులు కిందికి ఉన్నటువంటి అశ్వత్థవృయక్షము నాశము లేనిది అని పెద్దలుచెబుతారు. ఆ అశ్వత్థవృక్షము యొక్క ఆకులే వేదములు. ఈ విషయమును ఎవరు తెలుసుకుంటారోనాగే నేదనుల గురించితెలుసుకున్న వారు అవుతారు.
సంసారమును అశ్వత్థ వృక్షముతో పోల్చారు వ్యాసులవారు. అశ్వత్థవృక్షము అంటేరావి చెట్టు.ఈ సంసారానికి అశ్వత్థ వృక్షనికి కొన్ని పోలికలు ఉన్నాయి. ఈ వృక్షము చాలాపెద్దది. విశాలంగా విస్తరించి ఉంటుంది. అలాగే ఈ సంసారం కూడా అతటా విస్తరించిఉంటుంది. ప్రపంచంలో ఏ మూలకు పోయినా ఈ సంసారము

అమరనథ్ అమర్

# భగవద్గీత
# పదునైదవ అధ్యాయము
# పురుషోత్తమ ప్రాప్తియోగము



(అంటే నేను, నాది అనే తత్వము) అక్కడ ప్రత్యక్షం అవుతుంది. ఈ సంసారము అనంతము. దీనికి మొదలు, తుది లేదు, అంతటావిస్తరించి ఉంటుంది. ఈ సంసార వృక్షమునకు మూలము అంటూ మనకు కనపడదు. ఎవరిలోఏకోరిక ఎప్పుడు ఎలా పుడుతుందో తెలియదు. ఏ బంధము ఎప్పుడు ఎవరితో ఎలా కలుగుతుందోతెలియదు అలాగే ఈ అశ్వత్థవృక్షముయొక్కమూలము అంటే తల్లి వేరు ఎక్కడి వరకు వ్యాపించిఉందో మనకు తెలియదు. కనపడదు.

ఈ సంసారానికి ఎన్నో విధములైన, రకరకాలైన లక్ష్ణణాలు, కోరికలు, ఆశలు, ఆశయాలు, అనుబంధాలు, ఉన్నాయి. అవి మనిషికి మనిషికీ మారుతుంటాయి. అవి ఇన్ని అనిచెప్పలేము. అలాగే ఈ అశ్వత్థ వృక్షానికి కూడా అనేకము లైన శాఖలు ఉపశాఖలు రెమ్మలుఉన్నాయి. ఈ అశ్వత్థ వృక్షానికి లేక్కపెట్టలేనని ఆకులు ఉన్నాయి. ఆ ఆకులతోనే చెట్టు తన ఆహారాన్నితయారుచేసుకుంటుంది. సంసారంలో కూడా లెక్కపెట్టలేనన్ని కర్మలు ఉన్నాయి. మనం చేసేపనులు ఇన్ని అని చెప్పలేము. క్షణానికో పని చేస్తుంటాము. ఈ కర్మలతోనే ఈ సంసారాన్నినడుపుతుంటాము. పోషిస్తుంటాము. ఫలప్రదం చేస్తుంటాము. ఈ కర్మకాండలన్నీ మనకువేదములలో చెప్పబడ్డాయి. అందుకే ఈ చెట్టు ఆకులను వేదములతో పోల్చారు. (ఛందాంసి యస్యవర్ణాని).

ఈ అశ్వత్థ వృక్షమునకు పళ్లు కాస్తాయి. ఈ సంసారము అనే మహావృక్షము మనంచేసే కర్మలకు తగిన ఫలితములను, అంటే సాత్విక కర్మలకు, రాజస కర్మలకు, తామస కర్మలకువాటి వాటికి అనుగుణమైన ఫలితములను, ఇస్తుంటాయి. ఈ అశ్వత్థ వృక్షము అనేకములైన పక్షులకు, మానవులకు, గూళ్లు కట్టుకోడానికి, పళ్లు తినడానికీ, దాని కింద విశ్రమించడానికీ, ఆశ్రయంఅవుతూ ఉంది. అలాగే సంసార వృక్షం కూడా అందులో ఉండే మానవులకు, ప్రాణులకు ఆశ్రయంగాఉంటూ ఉంది. ఈ సంసారంలో పడిన వారికి ఆశ్రయం కల్పిస్తూఉంది. మంచి కర్మలు చెడుకర్తలుచేయిస్తూ ఉంది. మంచి చెడు ఫలితములను ఇస్తూ ఉంది. ఈ అశ్వత్థ వృక్షమును గొడ్డళ్లతోనరికి నాశనం చేయవచ్చు. అలాగే ఈ సంసారము అనే వృక్షమును జ్ఞానము అనే గొడ్డలితోసమూలంగా నాశనం చేయవచ్చు ఈ కారణాలచేత సంసారమును అశ్వత్థవృక్షముతో పోల్చవచ్చుఅని శంకర భగవత్పాదులవారు బోధించారు.

వృక్షములలో ఆశ్వత్థ వృక్షము అంటే రావి చెట్టు పవిత్రమైనది. రావి చెట్టు నారాయణ - స్వరూపంగా భావిస్తాము. ప్రళయకాలంలో పరమాత్మ చిన్ని శిశువుగా రావి ఆకు మీద పడుకొనిఉన్నాడు అని అంటారు. అందుకే ఆయనకు వటపత్రశాయి అని పేరు. సంసారము అనే రావిచెట్టుకు ఆకులు ఉన్నాయి. ఆ ఆకులే వేదములు, వేద మంత్రములు అని అన్నారు. ఈ అశ్వత్థవృక్షము మామూలుగా ఉన్నా, సంసారము అనే ఈ వటవృక్షము తల కిందులుగా ఉంటుందిఅంటే వేళ్లు పైకి ఆకులు కొమ్మలు కాండము కిందికి ఉంటాయి. ఈ సంసార వృక్షము చాలాపురాతనమైనది.

అమరనధ అమర

# భగవద్గీత
# పదునైదవ అధ్యాయము
# పురుషోత్తమ ప్రాప్తియోగము



మనం మన జ్ఞానంతో నాశనం చేస్తే తప్ప ఎప్పటికీ నాశనం అయ్యేది కాదు. ఈవిషయం తెలుసుకున్న వాడు వేదార్థములను తెలుసుకున్న వాడు అని కృష్ణుడు బోధించాడు.

మామూలుగా రావి చెట్టు మొదలు భూమిలోకి ఉంటుంది. కాండము, కొమ్మలు, ఆకులు బయట ఉంటాయి. కాని సంసారము అనే ఈ వృక్షము తల్లకిందులుగా ఉంటుంది. వేళ్లు పైకి, కాండము, కొమ్మలు, ఆకులు కిందికి ఉంటాయి. ఈ విపరీతమునకే దీనిని సంసారవృక్షము అని పిలుస్తారు. పరమాత్మ నుండి ప్రకృతి మహత్తత్వము, మూడు గుణములు, అహంకారముపుట్టాయి. దానికి ప్రతీకయే ఈ తల్లకిందులుగా ఉన్న చెట్టు. అంటే పైన ఉన్న వేళ్లు పరమాత్మఅయితే దాని నుండి కాండము, కొమ్మలు, ఆకులు వచ్చాయి. ఈ అనంత విశ్వమునకు కారణము. పరమాత్మ అంటే రావిచెట్టు వేళ్లు. ఆ పరమాత్మ కిందికి దిగి అందరిలో ఆత్మస్వరూపుడుగా ఉన్నాడు. ఆ ఆత్మ ప్రాపంచిక విషయములతో కలిసి జీవాత్మ అయింది. ఈ ప్రకృతి పురుషుల అనుబంధమేసంసారము. కాబట్టి ఈ సంసారమునకు మూలము పైన ఉన్న పరబ్రహ్మ, పరమాత్మ.

ఇంకొక విధంగా చెప్పాలంటే సంసారము అనేది మాయ. మాయలో పడ్డ వాడికిలేనిది ఉన్నట్టుగానూ, ఉన్నది లేనట్టుగానూ అనిపిస్తుంది. అలాగే ఈ సంసార వృక్షము కూడాతల్లకిందులుగా కనిపిస్తుంది. శ్వః అంటే రేపు అ లేనిది. అరోజు ఉండి రేపు లేనిది అని అర్థం. కానిదీనిని అవ్యయం అని అన్నారు. ఎందుకంటే మనకు ఈ సంసారము కూడా నిరంతరముఉంటుంది. నంసారం లో వచ్చే సుఖములు, దుఃఖములు ,రాగద్వేషములు అన్నీ ఈరోజు ఉంటే రేపుఉండవు. కాని ఈ సంసారము మాత్రం శాశ్వతంగా ఉంటుంది. మనిషి చచ్చినా వాడిని వదలదు. వాసనల రూపంలో వెంటాడుతూనే ఉంటుంది. కాబట్టి దీనిని అవ్యయం అని అన్నారు. ఇటువంటిదికనుకనే దీనిని తల్లకిందులుగాఉన్న చెట్టు అని అన్నారు.

ఈ చెట్టు ఆకులు వేదములు అని అన్నారు. వేదములలో అనేక యజ్ఞములు, యాగములు, కర్మల గురించి చెప్పబడ్డాయి. మానవులు ఆ కర్మలు ఆచరిస్తూ వాటి ఫలములనుఅనుభవిస్తూ ఈ సంసారము అనే మహావృక్షము కింది సేదతీరుతున్నారు. వారి వారి కర్మలఫలితములకు అనుగుణంగా జన్మతరువాత జన్మ ఎత్తుతూ, జనన మరణ చక్రంలో తిరుగుతున్నారు. ఈ సంసారము గురించి తెలుసుకుంటే ఇంక తెలుసుకోవలసింది ఏమీ ఉండదు. కాని ఈసంసారము గురించి తెలుసుకొని అందులో నుండి బయట పడటానికి ఎవరూ ప్రయత్నం చేయడంలేదు .అదే మాయ.

2. అధశ్చోర్ధ్వం ప్రసృతాస్తస్య శాఖా గుణప్రవృద్ధా విషయప్రవాలాః |
అధశ్చ మూలాన్యనుసంతతాని కర్మానుబంధీని మనుష్యలోకే || ||

ఈ సంసారము అనే వృక్షము యొక్క కొమ్మలు సత్వరజస్తమోగుణములతో వృద్ధిపొందాయి. ఈ కొమ్మలకు విషయ వాంఛలు, కామ కోరికలు అనేవి చిగుళ్లు, నిరంతరంచిగురిస్తుంటాయి.

అమరనాథ్ అమర్

# భగవద్గీత
# పదునైదవ అధ్యాయము
# పురుషోత్తమ ప్రాప్తియోగము



ఈ సంసార వృక్షము కొమ్మలు (మూడుగుణములు), రెమ్మలు (విషయవాంఛలు) చెట్టు కింది నుండి చిట్టచివరి చిటారు కొమ్మదాకా వ్యాపించి ఉన్నాయి. ఈ మనుష్యలోకంలోకర్మలు చేయడానికి వాటి వలన బంధనములు కలగడానికి మూలమైన ఈ సంసార వృక్షమువేళ్లు నలుమూలలా విస్తరించి ఉన్నాయి. సంసారము అనే ఈ మహావృక్షము యొక్క కొమ్మలు సత్వరజస్తమోగుణముల తోవృద్ధిచెందాయి.. వీటికి చిగురించే చిగుళ్లే , కోరికలు, కామ వాంఛలు, విషయ వాంఛలు. అంటేఒక చిగురు పక్కనే మరొక చిగురు వేస్తుంది. ఒక కోరిక తీరితే మరొక కోరిక పుట్టినట్టు ఈ చెట్టుఏదో మానవలోకమునకు పరిమితం అనుకుంటే పొరపాటు. ఈ చెట్టు వేళ్లు అంటే ఈ సంసారముఅనే చెట్టు దాని వేళ్లు బ్రహ్మలోకము వరకూ దట్టంగా ధృడంగా వ్యాపించి ఉన్నాయి. అంటే ఈమాయ అనే సంసార వృక్షము అన్ని లోకములలో వ్యాపించి ఉంది. ఈ సంసార వృక్షము యొక్కపని సకల జీవరాసులను తన నీడలోకి ఆహ్వానించి, వారిలో కోరికలుపుట్టించి, వారి చేత కర్మలుచేయించి, కర్మబంధనములు కలుగజేయడం. ప్రస్తుతం మనం ఆ చెట్టు నీడలో కూర్చుని ఆ చెట్టుపళ్లు తింటున్నాము. కాసేపు కింది కొమ్మ మీదికీ ఇంకాసేపుపై కొమ్మమీదికీ ఎగురుతున్నాము. అంటేవివిధములైన జన్మలుపొందుతున్నాము. మోక్షము అంటే ఆ చెట్టు ను అంటే సంసారమును వదిలిపెట్టిఎగిరిపోవడమే. అంటే జ్ఞానముతో ఈ మాయను ఛేదించడమే.

3. న రూపమస్యేహ తథోపలభ్యతే నాంతో న చాదిర్న చ సంప్రతిష్ఠా |
అశ్వత్థమేనం సువిరూఢమూలమసంగశస్త్రేణ దృఢేన ఛిత్త్వా || ||

ఈ సంసారము అనే వృక్షము గురించి తెలుసుకోవడంలో గొప్పేముంది అనుకుంటేపొరపాటే. అంటే ఈ సంసారవృక్షం గురించి తెలుసుకోవడం అంత సులభం కాదు. ఈ సంసారవృక్షము యొక్క ఆది అంతములు ఎవరికీ తెలియవు. ఎందుకంటే ఈ సంసారవృక్షం ఈ నాటిదికాదు. దీని ఆది తెలియదు అంతము తెలియదు. మధ్యలో ఏముందో అసలేతెలియదు. పోనీదీనికి ఒక రూపం ఉందా అంటే అదీ లేదు. కాని ఉన్నట్టుగా అనిపిస్తుంది. అదే మాయ.

ఈ సంసారము ఈ విధంగా ఉంటుంది అని ఎవరూ నిర్వచించలేరు. ఎందుకంటేదాని స్వరూపము ఇలా ఉంటుంది అని ఎవరూ ఊహించలేరు. ఈ సంసారము అనే వృక్షముయొక్క వేళ్లు బాగా పాతుకొని పోయి విశాలంగా విస్తరించి ఉన్నాయి. ఎక్కడక్కడికో పాకిపోయి ఉన్నాయి. కాబట్టి ఈ సంసారము గురించి తెలుసుకున్నవాడు ఇప్పటి వరకూ ఎవరూ లేరు. అందరూ ఈసంసారము అనే మాయలో పడ్డవాళ్లే కాని సంసారము గురించి తెలుసుకున్న వాళ్లు లేరు. సముద్రములో మునిగిన వాడికి దాని అది అంతము తెలియదు. అలాగే ఈ సంసారము అనేసముద్రములో మునిగిన వాడికి దాని ఆది అంతము లోతు తెలియదు కదా. అంత బలమైనది ఈసంసార వృక్షము.

అమరనధ్ అమర్

# భగవద్గీత
# పదునైదవ అధ్యాయము
# పురుషోత్తమ ప్రాప్తియోగము



ఈ సంసారవృక్షమును నరకడానికి ఒకే ఒక కత్తి ఉంది. అదే అసంగము. వైరాగ్యము. అంటే సంసార విషయములలో ప్రాపంచిక విషయములలో అంటీ అంటనట్టు ముట్టీముట్టనట్టువ్యవహరించడం. ప్రాపంచిక విషయాల మీద ఆధారపడకుండా, పరమాత్మ మీద ఆధారపడటంఅలవాటు చేసుకోవాలి. ఈ ఆస్తి, ఈ కారు, ఈ సంపదలు, ఇంతడబ్బు ఉంటే కానీ నాకుజీవనంగడవదు అనే ప్రాపంచిక సంగము వదిలిపెట్టాలి. ఇవన్నీ పరమాత్మ ప్రసాదము అనే భావనతోఉండాలి. దీనినే రాగము, సంగము లేకపోవడం అంటే విరాగము అంటే వైరాగ్యము, అసంగముఅని అంటారు. అసంగంగా ఉన్నంత వరకు ఈ వృక్షము ఎవరినీ ఏమీచేయలేదు.

ఈ సంసారము అనేమాయలో పడ్డవాళ్లు, అసంగము అనే కత్తితో దానిని నరికివేయగలరు. ఏదో పైపై కొమ్మలు రెమ్మలు కొట్టేస్తే సరిపోదు. పూర్తిగా నరికివేయాలి. ఎందుకంటేఈ సంసారవృక్షము వేగంగా చిగురిస్తుంది. కాబట్టిదృఢమైన చిత్తముతో, ఆసంగము అనే కత్తితోవేళ్లతో సహా నరికివేయాలి. ఈ సంసారము అనే రాలి చెట్టును మూలంతో సహా నరికివేస్తేనే, పరమపదము చేరుకోగలరు. మరలా ఈ సంసారము, పునర్జన్మ పొందరు.

ఈ శ్లోకములో సంసార వృక్షమును గురించి అంత భయంకరంగా వర్ణించారు. ఈ సంసార వృక్షము వేళ్లు చాలా దృఢమైనది. బాగా పాతుకుపోయి ఉన్నాయి. ఓ పట్టానపెకలింపబడవు. ఈ సంపార వృక్షము చాలా కాలం ముండి ఉండటం వలన దాని కాండముబలంగా ధృఢంగా ఉంది. వామ్మో ఇంత పెద్దది లావుది దీనిని ఎలా నరకడం అని ఏ మాత్రందిగులుపడవద్దు అంటున్నాడు పరమాత్మ. ఇంతపెద్ద వృక్షానికి కూడా చిన్న కత్తి చాలు. అదే అసంగము. దేనితోనూ సంగం పెట్టుకోకపోవడం నిర్లిప్తంగా ఉండటం. ఈ కత్తితో ఈ సంసారము అనే వృక్షాన్నిసమూలంగా నరికివేయవచ్చు.

అసంగము అంటే ఏమిటి. రాగము అంటే కోరికలు లేకపోవడం. ప్రాపంచికవిషయములలో అంటీముట్టనట్టు ఉండటం. కాని ఇది అంత సులభం కాదు. పూర్వము విశ్వామిత్రుడిలాంటి మహా ఋషులే ఈ సంసార వృక్షమును ఛేదించలేకపోయారు. దేనిని జయించినాకోపమును కోరికలను జయించలేకపోయారు. ఒకసారి ఈ సంసారము అనే వృక్షమును నరికినతరువాత మనం ఈ ప్రపంచం మీద, ప్రాపంచిక విషయాలమీద, విషయవాంఛలమీదా ఆధారపడటంమానేస్తాము. పరమాత్మమీద ఆధారపడతాము. మనల ఏమిటో తెలుసుకుంటాము. నేను ఈ శరీరంకాదు అత్మస్వరూపాన్ని అనే జ్ఞానం పొందుతాను. ఆ విషయాలనే తరువాతి శ్లోకాలలో వివరించాడు. కృష్ణుడు.

**4. తతః పదం తత్పరిమార్గితవ్యం యస్మిన్గతా న నివర్తంతి భూయః |**
**తమేవ చాద్యం పురుషం ప్రపద్యే యతః ప్రవృత్తిః ప్రసృతా పురాణీ ||4||**

అమరనాథ్ అమర్

# భగవద్గీత
# పదునైదవ అధ్యాయము
# పురుషోత్తమ ప్రాప్తియోగము



అసంగము, వైరాగ్యము అనే కత్తిని ఉపయోగించి ఈ సంసారము అనే వృక్షమునుసమూలంగా నరికాము. తరువాత ఏం చెయ్యాలి. "తతః పదం పరిమార్గతవ్యం" అంటే పరమాత్మపదమును పొందడానికి ప్రయత్నించాలి. దానికి మార్గం వెతకాలి. ఆ పరమ పురుషునిలో సాయుజ్యంపొందాలి. అదే శాశ్వతమైనది. పరమానందకరమైనది. పరమ శాంతిని కలుగజేస్తుంది. అందుచేతప్రతివాడూ, వేళ్లు పాతుకుపోయిన ఈ సంసాగవృక్షమును వైరాగ్యము, అసంగము అనే కత్తితోనరికిన తరువాత, పరమాత్మ ను చేరుకునే మార్గము కొరకు వేదకాలి. దీనికి సరి అయిన మార్గంకూడా సూచించాడు కృష్ణుడు.

ముందు "పురుషం ప్రపద్యే" అంటే ఆ పరమాత్మను శరణు వేడాలి. అయన యందుభక్తి శ్రద్ధ కలిగి ఉండాలి, నిష్కామ కర్మాచరణ యందు ఆసక్తి కలిగి ఉండాలి. మరిఆ పురుషుడుఎవరు అంటే "పురాణీ" అంటే సనాతనుడు, ఆది మధ్యాంత రహితుడు అంటే ఆది అంతము లేనివాడు. ఆయననే ఎందుకు శరణు వేడాలి అంటే "యత: ప్రవృత్తి: ప్రసృతా" అంటే ఆయన నుండే ఈసంసారము పుట్టింది. అన్ని లోకాలలో వ్యాపించింది. ఎవరైతే పుట్టిస్తారో వాళ్లే దానిని నాశనంచేయడానికి సమర్థులు. ఈ సంసారము ఆ పరమాత్మ నుండి పుట్టింది కాబట్టి ఆయనను ఆశ్రయిస్తేనేఆ సంసారమును నాశనం చేయడానికి సమర్థత వస్తుంది. "తత:" అంటే ఆ తరువాత "పదం తత్పరిమార్గితవ్యం" అంటే ఆ పరమ పురుషుని పదము గురించి వెతకాలి. తెలుసుకోవాలి. దానికిశాస్త్ర పఠనము వేదాంత విచారణ చేయాలి. ఇది గురువు సాయంతోనే సాధ్యం అవుతుంది. దీనివలన ఏం జరుగుతుంది? "యస్మిన్ గతా న నివర్తన్తి భూయ:" అంటే ఎక్కడికి వెళితే మరలాతిరిగి రారో అంటే తిరిగి పునర్జన్మ ఉండదో, మరలా ఈ జనన మరణ చక్రంలో పడరో, అక్కడికివెళతారు. ఆ పరమపదమును చేరుకుంటారు. కాబట్టి ఆ పురుషోత్తముడిని చేరుకోవాలంటే ఇన్నిమెట్లుఎక్కాలి.

**5. నిర్మానమోహా జితసంగదోషా అధ్యాత్మనిత్యా వినివృత్తకామాః |**
**ద్వంద్వైర్విముక్తాః సుఖదుఃఖసంజ్ఞైర్గచ్ఛంత్యమూఢాః పదమవ్యయం తత్ || ||**

ఈ మెట్టు అన్నీ ఎక్కడానికి ప్రతి మానవుడిలో ఏయే లక్షణాలు ఉండాలో ఈ శ్లోకంలోవివరించాడు వ్యాసులవారు.

1 .నిర్మానమోహ: అంటే అభిమానము, మోహము వదిలిపెట్టాలి. వినయం, విధేయత కలిగి ఉండాలిఅహంకారము ఉండకూడదు. దేహాభిమానం వదిలిపెట్టాలి. అవివేకము, అజ్ఞానము నుండి బయటపడాలి. మనలో ఉన్న గొప్పతనం అంతా పరమాత్మ అనుగ్రహంగా భావించాలి. అంతేకానీ, అదిఅంతా మనగొప్పతనం అని అహంకరించ కూడదు. మనవుడికి ఎన్ని విద్యలు తెలుసని కాదుఎంత వినయం విధేయత ఉన్నాయి అన్నది ముఖ్యం .రాముడికన్నారావణుడికి ఎన్నోవిద్యలు తెలుసు. కాని రావణుడిని ఎవరూ పూజించరు.

అమరనధ్ అమర్

# భగవద్గీత
# పదునైదవ అధ్యాయము
# పురుషోత్తమ ప్రాప్తియోగము



కారణం. అతనిలో వినయం లేదు. అహంకారం తప్పరాముడిని ఆంఅందరూ దేవుడిలా పూజిస్తారు కారణం రాముడు అహంకారి కాదు. తల్లి తండ్రులమాట, గురువు మాట విన్నాడు. ఎన్నో కష్టాలు అనుభవించాడు. అందుకే రాముడు దేవుడయ్యాడు. అందుకే భారతీయ సాంప్రదాయంలో పెద్దలను చూచినప్పుడు రెండు చేతులు జోడించి నమస్కారంపెట్టమన్నారు. నమస్కారం పెద్దల పట్ల వినయము, విధేయత, సూచిస్తుంది.

2 .జితసఙ్గదోషా..అంటే సంసారము అనే వృక్షము నరికాము కదా అని అహంకరించి, మరలసంగములో పడకుండా, ప్రాపంచిక విషయముల మీద సంగత్వమును పూర్తిగా విడిచిపెట్టాలి.

విపరీతమైన అనుబంధాలు పెంచుకోకూడదు. నేను లేకపోతే వీళ్లంతా ఏమైపోతారు అనే భావనవిదిలిపెట్టాలి. అంటే రాగము ద్వేషము ఈ రెండింటిని మన అధీనంలో ఉంచుకోవాలి కానీ వాటికిబానిస అయి పోకూడదు.

3 .వినివృత్త కామా: అంటే అధర్మపూరితమైన కోరికలను పూర్తిగా విడిచిపెట్టడం. ధర్మబద్ధంగాఆలోచించాలి. ధర్మబద్ధమైన కోరికలనే సంకల్పించాలి. ఉన్నదానితో తృప్తి చెందాలి. అడ్డమైన కోరికలుతీరాలని కోరుకోకూడదు. అవి తీరకపోతే తీవ్రమైన ఆవేదన మాత్రమే కలుగుతుంది. దీని వలనమానసిక ప్రశాంతత దెబ్బతింటుంది. శారీరకంగా కూడా ఇబ్బందులు వస్తాయి. కాబట్టి కోరికలనుఅదుపులో ఉంచుకోవాలి.

4 .ద్వంన్ధై ర్విముక్తా: అంటే ద్వంద్వములను సమానంగా చూడటం. వాటి నుండి విడివడటం. ఈ ద్వంద్వములు సుఖదుఃఖముల రూపంలో మనలను అనేకమైన ఇబ్బందులకు గురిచేస్తుంటాయి. రాగద్వేషములు, శీతోష్ణములు, లాభాలాభములు, జయాపజయములు వీటినే ద్వంద్వములు అనిఅంటారు. వీటి వలన సుఖం కానీ, దు:ఖం కానీ కలుగుతుంది. సాధారణంగా ఈ ద్వంద్వములవలన తక్కువ సుఖం ఎక్కువ దు:ఖం కలుగుతుంటుంది. కాబట్టి వీటిని సమంగా చూడగలగాలి. దేనికీ అతిగా స్పందించకూడదు. ఏది వచ్చినా దానిని పరమాత్మ ప్రసాదంగా స్వీకరించాలి.

5 .అధ్యాత్మనిత్యా అంటే ప్రతి దినము శాస్త్ర పఠనము, అధ్యయనము, శ్రవణము, సత్సంగము చేయాలి. శరీరము ఆరోగ్యంగా ఉండటానికి మంచి భోజనము ఎంత అవసరమో అలాగే మానసిక ప్రశాంతతకొరకు ఇవి అవసరము.

6.అమూఢా: అంటే ఇవన్నీ అనుసరించిన వాడు మూఢత్వములో పడడు. మూఢత్వములో ఉన్నాదాని నుండి బయట పడతాడు. తెలివిగా ఉంటాడు. ఇటువంటి వాడు తత్ పైన చెప్పబడినఅవ్యయం అంటే నాశనము లేని, శాశ్వతము అయిన పరమ పదమును, గచ్ఛన్తి పొందుతున్నాడు. ఈ సాధనములతో మానవుడు పరమపదమును చేరుకోవచ్చు అని పరమాత్మ బోధించాడు.

అమరనధ్ అమర్

# భగవద్గీత
# పదునైదవ అధ్యాయము
# పురుషోత్తమ ప్రాప్తియోగము



**6. న తద్భాసయతే సూర్యో న శశాంకో న పావకః |**
**యద్గత్వా న నివర్తంతే తద్ధామ పరమం మమ || ||**

ఈ పరమాత్మ స్థానము, పరమ పదము, పురుషోత్తముడి స్థానము ఎలా ఉంటుంది. అనే విషయాన్ని ఈ శ్లోకంలో వివరిస్తున్నాడు.

సూర్యుడు స్వయం ప్రకాశకుడు. తనకు తానేగా ప్రకాశిస్తుంటాడు. సూర్యుని వెలుగుచంద్రుడి మీద పడిచంద్రుడు ప్రకాశిస్తాడు కాని ఈ సూర్యుడికి కూడా ప్రకాశించే శక్తిని ఇచ్చినవాడుపరమాత్మ. సూర్యుని వెలుగులో పరమాత్మ ప్రకాశించడు. పరమాత్మ సంకల్పం వలననే సూర్యుడుప్రకాశిస్తున్నాడు. ఎందుకంటే సూర్యుడు కూడా టైమ్ అండ్ స్పేస్ కు పరిమితం .సూర్యుడు ఈప్రకాశి,స్తున్నాడు. ఎందుకంటే సూర్యుడు కూడా టైమ్ అండ్ స్పేస్ కు పరిమితం. సూర్యుడు ఈఅనంత విశ్వంలో ఒక నక్షత్రం. ఆ నక్షత్రం కూడా కొంత కాలం వేడిని. వెలురును విరజిమ్మి, కాలక్రమేణా తన వేడిని కాంతిని కోల్పోయి మృతమౌతుంది. అటువంటి మృతనక్షత్రాలు రోదసిలోకోకొల్లలుగా ఉన్నాయని మన ఖగోళ శాస్త్రజ్ఞులు చెబుతున్నారు. ఒక నక్షత్రం నుండి వచ్చే వెలుగునుబట్టి ఆ నక్షత్రం ఎంత దూరంలో ఉందో అంచనా వేస్తారు. కాని ఆ నక్షత్రం వెలుగు భూమినిచేరుకొని, అక్కడ ఒక నక్షత్రం ఉంది అని తెలుసుకునేటప్పటికే ఆ నక్షత్రం కాలం తీరి ఉంటుంది. అంటే సూర్యుడి లాంటి నక్షత్రాలు కూడా కాలమునకు లోబడిఉంటాయి. కాని పరమాత్మకాలాతీతుడు, అందుకే ఈ శ్లోకంలో పరమాత్మ సూర్యుని వలన గానీ చంద్రుని వలన గానీప్రకాశింపబడడు అని చెప్పబడింది.

సాధారణంగా సూర్యుని వెలుగు గానీ, చంద్రుని వెలుగు గానీ భూమి మీద ఉండేవస్తువుల మీద పడి అవి ప్రకాశిస్తాయి. ఆ వెలుగులో మన కళ్లు ఆ వస్తువులను చూడగలుగుతాయి. అలాగే భూమిమీద వెలుగును ఇచ్చేది అగ్ని, అది దీపం రూపంలో కాంతులు వెదజల్లితే ఆ వెలుగులలోమనం అన్ని వస్తువులను చీకట్లో కూడా చూడగలము. అందుకే మనం సూర్యుడు, చంద్రుడు లేనిరాత్రిపూట, కటిక చీకట్లో దీపం వెలుగు కూడా లేకుండా ఏమీ చూడలేము. కాని కళ్లు మూసుకుంటేమనసుతో అన్నీ చూడగలము. ఎలాగంటే అక్కడ పరమాత్మ వెలుగు ఉంటుంది కాబట్టి, దానినేజ్ఞాన నేత్రము అని అంటారు. ఆ జ్ఞాన నేత్రము వెలుగులో మనం పరమాత్మను దర్శించగలము. వేరేఏవిధంగానూ అంటే సూర్యుడు, చంద్రుని, అగ్నియొక్క వెలుగులో మనము ప్రాపంచిక పదార్థాలనుచూచినట్టు పరమాత్మను చూడలేము. కేవలము జ్ఞానజ్యోతి సాయంతోనే పరమ పదాన్ని చేరుకోవాలి. ఆ పరమ పదమే పరమాత్మ స్థానము. అక్కడకు ఒక సారి వెళితే మరలా తిరిగి రారు. అటువంటిపరమపదమును చేరుకోడానికి ప్రతివారూ ప్రయత్నం చేయాలి అని కృష్ణుడు బోధిస్తున్నాడు.

అమరనధ్ అమర్

# భగవద్గీత
# పదునైదవ అధ్యాయము
# పురుషోత్తమ ప్రాప్తియోగము



ఇక్కడితో పరమాత్మ స్వరూప వర్ణన పూర్తి అయింది. ఇక్కడి నుండి మరొక కొత్తవిషయం మొదలు పెడుతున్నాడు వ్యాసుడు. ఈ శ్లోకం నుండి చూచే వాడు అంటే జీవాత్మచూడబడేది అంటే ప్రకృతి రెండూ ఆ పరమాత్మ స్వరూపాలే అని బోధిస్తున్నాడు.

**7. మమైవాంశో జీవలోకే జీవభూతః సనాతనః |**
**మనఃషష్ఠానీంద్రియాణి ప్రకృతిస్థాని కర్షతి || ||**

ఓ అర్జునా! ఆది అంతము లేని, సనాతనమైన నా అంశయే, జీవలోకమందు జీవుడిగాబయట ఉన్న ప్రకృతిని తన మనస్సు మొదలగు ఇంద్రియములతో ఆకర్షిస్తూ ఉంది.

ఈ శ్లోకంలో మమైవాంశ అనే పదం వాడారు వ్యాసుల వారు. అంటే పరమాత్మఅంశ అని అర్థం. ఇక్కడ అంశ అంటే పరమాత్మలో ఒక ముక్క అని కాదు. పరమాత్మ అంటే అఖండచైతన్యము, విశ్వచైతన్యము.

సూర్యుడు ఆకాశంలో వెలుగుతున్నాడు. మన ఇంట్లో గది చీకటిగా ఉంది. మనంఒక అద్దం తీసుకొని, సూర్యుడి ఎదురుగా పెడితే, సూర్యుడు ఆ అద్దంలో నుండి ప్రతిఫలించిసూర్యుని కాంతి గదిలోపల గోడ మీద పడి గది అంతా వెలుగుతో నిండిపోతుంది. అద్దం పగిలిపోగానేఆ కాంతి పోతుంది. పరమాత్మ యొక్క అఖండ చైతన్యము యొక్క ప్రతిబింబమే మనలో వెలిగేఆత్మ చైతన్యము. ఆ ఆత్మ చైతన్యము మనోబుద్ధిఅహంకారాలతో కలిసి జీవ చైతన్యంగా మారి, ఈప్రకృతిలో కలిసిపోయింది. ఈ శరీరం పడిపోగానే అంటే అద్దం పగిలిపోగానే జీవచైతన్యం పోతుంది. అఖండ ఛైతన్యంమాత్రం అలాగే ఉంటుంది. అంశ అంటే పరమాత్మయొక్క ప్రతిబింబచైతన్యముఅని అర్థం చేసుకుంటే ఈ శ్లోకం చక్కగా అర్థం అవుతుంది.

పరమాత్మ సనాతనుడు, అంటే చాలాకాలం నుండి ఉన్నాడు. ఆయనకు ఆది ఆంతములేదు. నాశము లేదు. ఆ పరమాత్మ తన అంశ అంటే ఆత్మస్వరూపుడుగా, ప్రతి జీవిలోనూప్రతిబంబముగా వెలుగుతున్నాడు. ఆ ఆత్మస్వరూపమే మనలో మనసు, బుద్ధి అహంకారము, చిత్తముపేర్లతో ఈ ప్రపంచములో వ్యవహరిస్తూ ఉంటుంది. కళ్లు, ముక్కు, చెవులు, చర్మము, నాలుక అనేఇంద్రియముల ద్వారా బయట ప్రపంచంలోని వస్తువులను చూస్తుంటుంది. వింటుందిఆస్వాదిస్తుంది అనుభవిస్తుంది కాబట్టి పరమాత్మ అన్నిజీవులలో ఆత్మస్వరూపుడుగా ప్రతిబింబముగావెలుగుతున్నాడు. ఆ ఆత్మస్వరూపమే జీవాత్మ పరమాత్మ జీవాత్మ వేరు కాదు. రెండూ ఒకటే. ఇరువురూసనాతనులే. నిత్యులే. అవ్యయులే. కాని వచ్చిన చిక్కల్లా జీవుడు

అమరనధ్ అమర్


# భగవద్గీత
# పదునైదవ అధ్యాయము
# పురుషోత్తమ ప్రాప్తియోగము



ఈ దేహము దానిలోనిఇంద్రియములు చేసేపనులన్నీ తాను చేస్తున్నట్లు భ్రమచెందుతున్నాడు. తనమీద ఆరోపించుకుంటున్నాడు. ఇదే మాయ. ఈ మాయలో పడటానికి మనోబుద్ధిఅహంకారాలు ప్రధాన పాత్రవహిస్తున్నాయి. జీవుడు. మనోబుద్ధిఅహంకారాలుగా మార్పుచెంది ప్రాపంచిక వ్యవహారాలలోమునిగితేలుతున్నాడు. అన్నీ నేనే చేసాను అనుకుంటూ కర్మత్వభావనతో ఉన్నాడు. నిజానికి బంగారంఅంతా ఒకటే. కాని చైను, వంకీ, వడ్డాణము, జూకాలు ఇలా రకరకాల రూపాలు ధరించిఊరిస్తుంటాయి. మనం వాటిని చూచి మోజుపడుతుంటాము. అలాగే కుండలో ఉన్న ఆకాశంకుండ ఆకారంలో ఉంటుంది. కుండ పగిలిపోతే అనంతాకాశంలో కలిసిపోతుంది. అలాగే జీవుడుతనలో ఉన్న అహంకారాన్ని కోరికలను వాసనలను వదిలిపెడితే, తన నిజస్వరూపమైన పరిశుద్ధమైన ఆత్మ స్వరూపంగా మారి పరమాత్మలో కలిసిపోతాడు. అదే ముక్తి, మోక్షము.

కాబట్టి మనం అందరం సకలజీవరాసులలో పరమాత్మ ఆత్మస్వరూపుడుగా ఉన్నాడుఅని గ్రహించి అందరిపట్ల సమాన భావము కలిగి ఉండాలి. ఒకరు ఎక్కువ ఒకరు తక్కువ అనేభేదభావము విడిచిపెట్టాలి. రాగద్వేషములు సుఖదుఃఖములు శీతోష్ణాలు, కేవలం మన భావనతప్ప నిజం కావు. ఒకదాని వెంట మరొకటి వస్తుంటాయి, పోతుంటాయి అనే నిజం తెలుసుకోవాలి. వాటికి లొంగిపోకూడదు. తన నిజస్వరూపం పరమాత్మ కాబట్టి పరమాత్మ ధ్యానంలో నిమగ్నంకావాలి. అహంకారం వదిలిపెట్టి మనసును ఆత్మయందు ఉంచాలి. అపుడు అపరిమితమైన ఆనందాన్నిశాంతిని పొందుతాడు.

హైదరాబాదునుండి అమెరికా వెళ్లినవాడు తిరిగి హైదరాబాదు ఎలా తిరిగి వస్తాడో, ఆ పరమాత్మ నుండి వచ్చిన మనం అందరం మరలా ఆ పరమాత్మను చేరుకోడానికి నిరంతరంప్రయత్నం చేయాలి. అమెరికాలో ఉండే సుఖాలను, అందాలను అనుభవిస్తూ మనం ఎక్కడి నుండివచ్చామో అది మరిచిపోకూడదు. అమెరికాలో మనం ఉండాల్సిన సమయం పూర్తికాగానే గెంటేస్తారుఅలాగే ఆ శరీరంలో మనం ఉండాల్సిన కాలం పుర్తికాగానే ఈ శరీరం మనలను గెంటేస్తుంది. ఆగెంటించుకునే లోపల మనం పరమాత్మను చేరుకునే ఏర్పాట్లు చేసుకోవాలి. అమెరికా వెళ్లగానేతిరుగుప్రయాణానికి టిక్కట్టు బుక్ చేసుకున్నట్టు, పుట్టినప్పటి నుండి మనం పరమాత్మ ఉండేపరమ పదానికి తిరుగు ప్రయాణానికి ప్రయత్నాలు ప్రారంభంచాలి.




www.sanatanadharm.com

అమరనధ్ అమర్

# భగవద్గీత
# పదునైదవ అధ్యాయము
# పురుషోత్తమ ప్రాప్తియోగము



**8. శరీరం యదవాప్నోతి యచ్చాప్యుత్క్రామతీశ్వరః |**
**గృహీత్వైతాని సంయాతి వాయుర్గంధానివాశయాత్ || ||**

ఇంద్రియములతో కూడిన ఈ దేహములో నుండి పరమాత్మయొక్క ప్రతి బింబ కాంతి తొలగిపోయినపుడు, ఈ శరీరం మరణిస్తుంది. అప్పుడు పుష్పముల మీది నుండి వీచే గాలి ఆ పుష్పముల యొక్క వాసనలను తనలో ఎలా మోసుకొని పోతుందో, అలాగే మనోబుద్ధి అహంకారాలతో కూడిన సూక్ష్మశరీరం అప్పటి వరకు స్థూల శరీరంలో తాను అనుభవించిన వాసనలను తనతో కూడా గ్రహించి బయటకు వస్తుంది.

ఈ శ్లోకంలో పరమాత్మ ఒక కొత్త విషయాన్ని ఆవిష్కరిస్తున్నాడు. దేహములో ఉన్న జీవాత్మ దేహము కాల పరిమితి దాటగానే ఆ దేవమును విడిచిపెట్టి దేహములో నుండి బయటకు వస్తాడు. దానినే మనము మరణము అంటాము. ఆ సమయంలో ఏం జరుగుతుందో వివరిస్తున్నాడు కృష్ణుడు. గాలి పుష్పముల నుండి వచ్చే సుగంధము మీది నుండి, మురికినుండి వచ్చే దుర్గంధము మీద నుండి వీచినపుడు ఆ సుగంధ దుర్గంధములు గాలిలో కలిసి వెళుతుంటాయి. అలాగే జీవుడు ఈ శరీరములో నుండి బయటకు వచ్చినపుడు శరీరంలో ఉన్నప్పుడు తాను ఇంద్రియములు, మనసుతో చేసిన మంచి పనులు, చెడ్డ పనుల వాసనలను తన వెంట తీసుకొని వస్తాడు. ఆ వాసవలతో పాటు మరొక శరీరంలో ప్రవేశిస్తాడు. దీని వలన మనం ఈ క్రింది విషయాలను గ్రహించాలి.

1.జీవాత్మ పరమాత్మ ఒకటే. వేరు కాదు.

2.జీవాత్మ, శరీరము వేరు. ఒకటి కాదు.

3.జీవాత్మ శరీరమును వదిలేటప్పుడు,

తాను ఈ శరీరంలో ఉన్నప్పుడు మనస్సుతో, ఇంద్రియములతో చేసిన పనుల వాససలను తనలో తీసుకొని వెళతాడు. వాటితో పాటు కొత్త దేహాలలో ప్రవేశిస్తాడు.

నేను వేరు శరీరం వేరు అని తెలుసుకున్న వాడు, శరీరము, మనస్సు కు కలిగే వికారములకు లోనుకాడు. నిర్మలంగా ఉంటాడు. తాను ఈ శరీరం కాడు, పరమాత్మ స్వరూపుడు అని అనుకుంటాడు. అహం బ్రహ్మాస్మి అనే భావంలో ఉంటాడు.

జీవుడు ఈ శరారాన్ని వదిలేటప్పుడు తనతో పాటు సూక్ష్మమైన ఇంద్రియముల యొక్క లక్షణములను, కర్మల యొక్క వాసనలను తనతో తీసుకొని వెళతాడు. జీవుడు తన జీవిత కాలమంతా ఏదో ఒక కర్మ చేస్తూనే ఉంటాడు. ప్రపంచంలో దొరికే పదార్థములను ముఖ్యంగా ధనమును, ఆస్తిని, రాజ్యమును, పదవులను, భార్య, సంతానము, బంధువులు, మిత్రులు సేకరిస్తుంటాడు. వాటిని అనుభవిస్తుంటాడు. దీనితోనే అతని జీవితం గడిచిపోతుంది. కాని ఇవేవీ కూడా మరణించేటప్పుడు అతని వెంటరావు. ఆ విషయం అతనికి తెలుసు కానీ తెలియనట్టే ఉంటాడు.

అమరనాథ అమర

# భగవద్గీత
# పదునైదవ అధ్యాయము
# పురుషోత్తమ ప్రాప్తియోగము



అదే అజ్ఞానము జీవుని వెంట వచ్చేవి రెండే రెండు, ఒకటి సూక్ష్మశరీరము రెండు ఆ సూక్ష్మశరీరానికి అంటుకొని ఉన్న అతని కర్మల వాసనలు. ఈ వాసనలు సంస్కారములు శుద్ధంగా ఉంటే, మంచి జన్మ వస్తుంది. ఈ వాసనలు ఆపరిశుద్ధంగా ఉంటే నీచజన్మలభిస్తుంది. మనం మరుజన్మ ఏది పొందాలో అది మన చేతిలోనే ఉంది అని పరమాత్మ స్పష్టం చేస్తున్నాడు. మనసు. ఇంద్రియముల సూక్ష్మతత్వాలు తప్ప మనతో పాటు గడ్డిపరక కూడా రాదు. బంధువులు మిత్రులు, భార్యబిడ్డలు, శ్మశానం దాకా వస్తారు. ధనము ఆస్తులు ఏవీ వెంటరావు. అవి అతని మరణాన్ని ఆపలేవు. అతనికి మంచి జన్మఇవ్వలేవు కేవలము మనస్సు, ఇంద్రియతత్వములు వాటితో చేసిన మంచి కర్మల వాసనలే అతని మరు జన్మను నిర్ణయిస్తాయి.

ఈవిషయాన్ని సులభంగా అర్థం కావడానికి ఒక ఉదాహరణ చెప్పాడు పరమాత్మ వాయువు అంతటా వీస్తూ ఉంటుంది. ఆ వాయువులో పూల మీది నుండి వచ్చే మంచి వాసనలు, మలినపదార్థముల నుండి చెడు వాసనలు చేరుతూ ఉంటాయి. ఆ వాసనల ప్రభావం వాయువుకు అంటదు. వాయువు ఈ మంచి వాసనలు చెడు వాసనలు తన వెంట ఎలా తీసుకొని పోతుందో, సూక్ష్మదేహం కూడా తన వెంట, మానవుడు తన జీవిత కాలంలో తన మనసు, ఐదు ఇంద్రియ సూక్ష్మతత్వములు, ఆ ఇంద్రియములతో చేసిన కర్మల వలన కలిగిన వాసనలను తన వెంట తీసుకొని పోతాడు. వాయువుకు ఎటువంటి పక్షపాతము లేనట్టే జీవాత్మకు కూడా ఎటువంటి పక్షపాతము లేదు. అంటే కేవలం మంచి వాసనలను మాత్రమే తీసుకొని, చెడు వాసనలు ఇక్కడే వదిలిపెట్టదు. అన్ని వాసనలను తన వెంట తీసుకొని జీవుడు మరొక దేహంలో ప్రవేశిస్తాడు. కాబట్టి మను అందరం ఈ విషయాన్ని చెక్కగా అవగాహన చేసుకొని, జీవిత కాలంలో మనసుతో ఇంద్రియములతో మంచి కర్మలు చేస్తే, సంగము విడిచిపెడితే, నిష్కామ కర్మలు చేస్తే, తన వెంట మంచి వాసనలు తీసుకొని పోయి మంచి జన్మ పొందగలడు. లేకపోతే నరకప్రాయమైన నీచజన్మ తప్పదు.

9. శ్రోత్రం చక్షుః స్పర్శనం చ రసనం ఘ్రాణమేవ చ |
అధిష్ఠాయ మనశ్చాయం విషయానుపసేవతే || ||

పరమాత్మ యొక్క ప్రతిబింబస్వరూపము అయిన జీవాత్మ, శరీరములో ఉన్న చెవులను, కళ్లను, చర్మమును, నాలుకను, ముక్కును ఆశ్రయించి, వాటి ద్వారా, బాహ్యప్రపంచములో ఉన్న శబ్దము మొదలగు విషయములను అనుభవిస్తున్నాడు.
సూక్ష్మశరీరం తనతో పాటు వాసనలను మోసుకొని పోయి మరొక దేహంలో ప్రవేశిస్తుంది. అక్కడ కూడా పంచేంద్రియ మనోబుద్ధిఅహంకారాలు వాటి వాటి స్థానాలలో చేరుకుంటాయి. క్రమక్రమేణా ఆ దేహంలో పాతుకొని పోతాయి.

అమరనధ్ అమర్

# భగవద్గీత
# పదునైదవ అధ్యాయము
# పురుషోత్తమ ప్రాప్తియోగము



పూర్వజన్మ వాసనలకు అనుగుణంగా, పూర్వ శరీరంలో మాదిరి విషయ సుఖాలను అనుభవిస్తుంటాయి. కంటితో మంచి విషయాలు. చెడు విషయాలు చూస్తాడు. అలాగే స్పర్శ తోనూ మంచి వాటిని, తాకకూడని వాటిని తాకుతాడు. నాలుకతో నానారకాల పదార్థములను, పానీయాలను తింటాడు.తాగుతాడు. ముక్కుతో మంచి వాసనలను, చెడు వాసనలను అనుభవిస్తాడు.

పైవిషయాలన్నీ మనస్సు చెబితే చేస్తాడు. ఆ మనస్సు అహంకారంతో కలిసి ఈ పనులు చేయిస్తుంది. ఇవన్నీ జీవుడు సాక్షీభూతంగా చూస్తుంటాడు. అనుభవిస్తుంటాడు. ఈ ప్రకారంగా జీవన చక్తిరుగుతూ ఉంటుంది.

**10. ఉత్క్రామంతం స్థితం వాపి భుంజానం వా గుణాన్వితమ్ |**
**విమూఢా నానుపశ్యంతి పశ్యంతి జ్ఞానచక్షుషః || ||**

ఏదో ఒక శరీరంలో ఉండటం, ఆ శరీరంలో ఉన్న మవస్సుతో, ఇంద్రియములతో కర్మలు చేయడం, సుఖదుఃఖములు అనుభవించడం, తరువాత ఆ వాసనలను తీసుకొని మరొక దేహంలో ప్రవేశించడం ఆ దేహంలో కూడా మనస్సుతో, ఇంద్రియములతో కర్మలు చేయడం వీటిగురించి విమూఢులు అంటే ఆజ్ఞానులు తెలుసుకోలేరు. జ్ఞాని అయిన వాడు మాత్రమే తన జ్ఞానము అనే చూపుతో తెలుసుకోగలడు.

మనలోనే ఇన్ని విషయాలు జరుగుతుంటే ఇవన్నీ మనకు ఎందుకు తెలియవు. ఎందుకు కనిపించవు. ఒకరు చెబితే గానీ మాకు తెలియవా! పరమాత్మను గురించి మాకు ఎందుకు తెలియదు అని కొంత మంది అనుకోవచ్చు దానికి సమాధానమే ఈ శ్లోకము. దేహంలో ఉన్న ప్రతివాడూ పరమాత్మను గురించి తెలుసుకోవచ్చు. ఎందుకంటే పరమాత్మ ఆత్మస్వరూపంలో ప్రతి దేహములోనూ ఉన్నాడు. నాగురించి తెలుసుకోవడానికి నేను ఎక్కడికీ వెళ్లనక్కరలేదు అంతర్ముఖం కావాలి. అంటే నా లోపలికి నేను చూసుకుంటే చాలు. కాకపోతే ఆ ప్రక్రియకు ఈ కళ్లు పనికి రావు. జ్ఞానచక్షువులు కావాలి.

అది ఎలాగంటే..జీవులు శరీరములను ధరిస్తారు. ఆ శరీరాలలో కొంత కాలం ఉంటారు. అనేక కర్మలు చేస్తారు. విషయ సుఖాలు, భోగాలు అనుభవిస్తారు. ధనం ఆస్తులు సంపాదిస్తారు భార్య సంతానము, బంధువులతో సంబంధాలు పెట్టుకుంటారు. మూడు గుణములను అనుభవిస్తారు. కాలం తీరిన తరువాత ఆ శరీరాలను వదిలిపెడతారు. మరొక శరీరాన్ని పొందుతారు. ఇది నిరంతరం జరిగే ప్రక్రియ. ఈ ప్రక్రియలు జరిగే కాలంలో ఎవరూ ఆత్మస్వరూపాన్ని చూడలేరు. ఎందుకంటే మూడుగుణములతో కూడిన అహంకారంతో, తానే ఈ శరీరం అనే భ్రమలో ఉంటాడు. అటువంటి వారు

అమరనధ్ అమర్

# భగవద్గీత
# పదునైదవ అధ్యాయము
# పురుషోత్తమ ప్రాప్తియోగము



పరమ మూఢులు అంటున్నాడు పరమాత్మ, వారు ఆత్మ గురించి ఏ మాత్రం తెలుసుకోలేరు. కేవలం జ్ఞానము సంపాదించి, జ్ఞాన చక్షువులతో మాత్రమే ఆత్మ గురించి తెలుసుకోగలరు. మనసు, అహంకారము ప్రాపంచిక విషయములలో విహరించినంతకాలము, లోపల ఉన్న ఆత్మను ఎవరూ చూడడం సాధ్యం కాదు. మనసును అంతర్ముఖం చేసి, నిశ్చలంగా ఉంటేనే, వాసనలను, బంధనాలను విడిచిపెడితేనే, సంగమును వదిలిపెడితేనే ఆత్మసాక్షాత్కారం అవుతుంది.

మామూలు కళ్లు బయట వస్తువులను మాతమే చూడగలవు. జ్ఞానచక్షువులు మాత్రమే లోపల ఉన్న అత్మను చూడగలవు. ఆత్మను గురించి తెలుసుకోవడం అంటే మన గురించి మనం తెలుసుకోవడమే. దీనికి ఎక్కడికీ వెళ్లనక్కరలేదు. అడవులకు, హిమాలయాలకు లేక వేరే ప్రాంతాలకు వెళ్లి, తపస్సులు చేయనక్కరలేదు. మీరు ఉన్నచోటనే ఏకాగ్రతతో కూడిన ధ్యానంలో కూర్చుని తెలుసుకోవచ్చు. కాకపోతే ఆత్మను గురించి తెలుసుకోవడానికి ముందు జ్ఞానం సంపాదించాలి. జ్ఞానము అనే కంటితో చూడగలగాలి బయట ప్రపంచంలో విహరిస్తున్నా ఇంద్రియములతో సుఖదుఃఖములు అనుభవిస్తున్నా, గుణములలో ప్రవర్తిస్తున్నా, జ్ఞాన చక్షువులు ఉన్న వారు మాతత్రమే తనను గురించి తాను తెలుసుకోగలరు. మూఢులు ఎప్పటికీ తనను గురించి తాను తెలుసుకోలేరు. వారికి ఆత్మసాక్షాత్కారం కలగదు.

జ్ఞానికి ఒకసారి ఆత్మసాక్షాత్కారం అయితే అతడు వరమాత్మను గురించి తెలుసుకున్నట్టే. ప్రతిబింబం గురించి తెలుసుకుంటే అసలు బింబం గురించితెలుసుకున్నట్టేకదా! ఎందుకంటే పతి బింబం ఉందంటే ఆసలు బింబం ఉన్నట్లే. అలాగే మనలో చైతన్యం ఉందంటే అసలు చైతన్యం ఉన్నట్టే కదా! ఆ అఖండ చైతన్యమే, విశ్వచైతన్యమే మనలో ఆత్మ చైతన్యంగా ప్రతిబింబిస్తూ ఉంది. ఈ విషయం మన కళ్లతో చూడలేము. కేవలం జ్ఞానులు మాత్రమే తమ జ్ఞానచక్షువులతో తెలుసుకోగలరు. మూఢులు తెలుసుకోలేరు ఎందుకంటే వారి దృష్టి ఎల్లప్పుడు బాహ్య ప్రపంచం, వాటి వలన కలిగే సుఖాల మీదనే ఉంటుంది వారు ఎన్నటికీ అంతర్ముఖులు కాలేరు. వారిలోకి వారు చూసుకోలేరు. తమలోనే ఉన్న పరమాత్మను వదిలిపెట్టి, ఎక్కడెక్కడో వెతుకుతుంటారు.

11. యతంతో యోగినశ్చైనం పశ్యంత్యాత్మన్యవస్థితమ్ |
యతంతోఽప్యకృతాత్మానో నైనం పశ్యంత్యచేతసః || ||

చాలా మంది అత్మసాక్షాత్కారం కొరకు ప్రయత్నిస్తుంటారు. వేదములు, శాస్త్రములు చదివి జ్ఞానం సంపాదిస్తారు. యోగులు అవుతారు. కాని కొంత మందికి మాత్రమే ఆత్మ సాక్షాత్కారం కలుగుతుంది. చాలా మందికికలుగదు. దానికి కారణం చిత్తశుద్ధి లేకపోవడమే. వారిలో ఉన్న అహంకారము నశించకపోవడమే.

అమరనధ్ అమర్

# భగవద్గీత
# పదునైదవ అధ్యాయము
# పురుషోత్తమ ప్రాప్తియోగము



కొంతమంది యోగులు జ్ఞానమును సంపాదించి, జ్ఞాన నేత్రముతో ఆత్మను చూడగలుగుతున్నారు. వారిలో కొంత మందికి జ్ఞానం ఉంటుంది కానీ వివేకం కలగదు. అటువంటి వారి మనస్సు నిశ్చలంగా ఉండదు. చంచలంగా ఉంటుంది. ఎందుకంటే వారికి వేషభాషల మీద ఉన్న శ్రద్ధ ఆత్మజ్ఞానము మీద ఉండదు. కేవలం సన్యాసుల మాదిరి వేషం వేసుకుంటారు. ధ్యానము, పూజలు చేస్తుంటారు కాని వారి చిత్తము మలినంగా ఉంటుంది. అటువంటి వారికి ఆత్మసాక్షాత్కారం కలగడం కష్టం. ప్రతి వాడూ ఆత్మసాక్షాత్కారం కొరకు ప్రయత్నించేవారే. కానీ వారిలో కొంత మంది మాత్రమే జ్ఞానము సంపాదించి, ఆత్మసాక్షాత్మారం పొందుతారు. వారిలో కూడా కొంత మందికి మాత్రమే చిత్తము నిశ్చలంగా ఉంటుంది. వారు మాత్రమే ఆత్మసాక్షాత్కారు పొందగలరు. మలినమైన చిత్తము కలవారు. సంస్కారము లేని వారు. ఇందుకు అనర్హులు. వారికిపాండిత్యము ఉంటుంది కాని చిత్తము మలినంగా ఉంటుంది. కాబట్టి ఆత్మసాక్షాత్మారము కావాలంటే అందుకు తగిన ప్రయత్న ఉండాలి. చిత్తము శుద్ధంగా ఉండాలి. అచేతసులు అంటే చిత్తము పరిశుద్ధంగా లేనివారు మూర్ఖంగా ఆలోచించేవారు. ఆత్మసాక్షాత్కారం పొందలేరు. ఎందుకంటే వీరు ఎన్ని ప్రయత్నములు చేసినా వీరి ప్రయత్నములు వక్రమార్గంలో నడుస్తాయి. చిత్తశుద్ధి ఉండదు. ఆ కారణంగా వీరికి ఆత్మ సాక్షాత్కారం కలుగదు. అటువంటి వీరికి గురువు గారి మార్గదర్శకత్వము అవసరము.

ఇప్పటి వరకు కృష్ణుడు అర్జునుడికి ఆత్మ, పరమాత్మ తత్వములను గురించి ఉపదేశించాడు. పరమాత్మ యొక్క అంశయే అంటే ప్రతిబింబమే ఆత్మ అనీ. అది మనోబుద్ధి అహంకారాలతో చేరి జీవాత్మగా రూపొంది బాహ్యప్రపంచంలో తిరుగుతూ ఉంటుందనీ, ఆ ఆత్మను పరమాత్మను తెలుసుకోవడానికి జ్ఞాననేత్రము కావాలనీ తెలుసుకున్నాము. ఇప్పుడు ఆ పరమాత్మయే ప్రకృతిరూపంలో బాహ్యంగా ప్రకటితము అవుతున్నాడు. అంటే ఈ దేహంలో జీవుడుగా ఉన్నదీ ఆ పరమాత్మస్వరూపమే, బయట ప్రకృతిగా ఉన్నదీ ఆ పరమాత్మ స్వరూపమే. అంటే పరమాత్మ సర్వవ్యాపి. ఇక్కడ జీవుడు అంటే మనలో ఉండే చైతన్యము. బయట ఉన్న అఖండ చైతన్యమే శరీరంలో పలమిత చైతన్యంగా ఉంది. ఈ విషయాన్నే పోతన గారు ప్రహ్లాదుడి నోటి వెంట పలికించాడు. "ఇందుకలడు అందు లేడు అని సందేహము నలదు. చక్రి సర్వోపగతుండు" అంటే ఆ పరమాత్మ ఇక్కడ ఉన్నాడు అక్కడ లేడు అనే సందేహమే అక్కరలేదు. పరమాత్మ నీలో ఉన్నాడు నాలో ఉన్నాడు అంతటా వ్యాపించి ఉన్నాడు. ఆయన లేని చోటు లేదు. అందుతే కళ్లుమూసుకొని నీలో ఉన్న పరమాత్మ యొక్క ప్రతి బింబస్వరూపము అయిన ఆత్మను చూడు. కళ్లు తెరిచి బయట ఉన్న ప్రకృతి అంతటా నిండి ఉన్న పరమాత్మను చడు.

అమరనధ్ అమర్

# భగవద్గీత
# పదునైదవ అధ్యాయము
# పురుషోత్తమ ప్రాప్తియోగము



**12. యదాదిత్యగతం తేజో జగద్భాసయతేఽఖిలమ్ |**
**యచ్చంద్రమసి యచ్చాగ్నౌ తత్తేజో విద్ధి మామకమ్ || ||**

ఏ తేజస్సుతో అయితే సూర్యుడు ఈ సమస్తజగత్తును ప్రకాశింపజేస్తున్నాడో, ఆ సూర్యుని కాంతి పడిన చంద్రుడు ఏ విధంగా అయితే రాత్రిపూట ప్రకాశిస్తున్నాడో, అగ్ని ఏతేజస్సు వెలుగు, వేడికలిగిఉన్నదో, అదిఅంతా నేనే. ఈ శ్లోకంలో కృష్ణుడు సూర్యచంద్రుల, అగ్ని యొక్క విభూతుల గురించి చెబుతున్నాడు. ఇక్కడ మనకు తేజస్సును ఇచ్చే మూడు మూల పదార్థాలు ఉన్నాయి. మొదటిది సూర్యుడు. ఆయనకు స్వయంప్రకాశకుడు. తనకు తానుగా ప్రకాశిస్తుంటాడు. చంద్రుడికి స్వయం ప్రకాశము లేదు. సూర్యుడి వెలుగు పడితేనే ప్రకాశిస్తాడు. అగ్ని ఏదో ఒక చర్య వలన మాత్రమే వెలుగుతుంది. అంటే రెండు వస్తువుల రాపిడి వలన అగ్ని పుడుతుంది కానీ తనకు తానుగా అగ్ని పుట్టదు. అందుకే మనకు ప్రకాశమును ఇచ్చే విభిన్నమైన మూడు మూల పదార్థాలను ఉపమానాలుగా తీసుకున్నాడు కృష్ణుడు.

సూర్యుడు, సూర్యుని వలన చంద్రుడు ప్రకాశిస్తున్నారు. భూమి మీద ఉన్న అన్ని వస్తువులను ప్రకాశింపజేస్తున్నారు. ఈ సూర్యుని తేజస్సు "అఖిలమ్' అంటే ఖిలము కానిది. కోట్ల సంవత్సరాల వరకు తరిగిపోనిది. నిరంతరం ప్రకాశిస్తూ మనకు వేడిని వెలుతురును అందిస్తూ ఉంటుంది. సూర్యుడి తేజస్సు ఉన్నంతవరకు చంద్రుడు కూడా ప్రకాశిస్తూ మనకు వెలుగును- ఇస్తుంటాడు. అందుకే అచంద్రార్కం అంటే సూర్యుడు, చంద్రుడు ఉన్నంతవరకు అని అర్థం. సూర్యచంద్రుల వెలుగు పడితేనే గానీ ఏ వస్తువు మనకు కనపడదు. ఇది అందరికీ తెలుసు. అలాగే అగ్నీ కూడా మండుతూ తన కాంతులను విరజిమ్ముతుంది. సూర్యుడు. చంద్రుడు లేని వేళల్లో మనం అగ్ని సాయంతోనే అగ్ని యొక్క వెలుగులోనే వస్తువులను చూడగలుగుతున్నాము. కాబట్టి ఈ లోకానికి పగలు సూర్యుడు, రాత్రిళ్లు చంద్రుడు, అన్నివేళల్లో అగ్ని ప్రకాశాన్ని ఇస్తుంటారు. ఈ నూసూర్యచంద్రులకు, అగ్నికి వెలుగును ఇచ్చి, ప్రకాశింపజేసేది నేనే అని తెలుసుకో అంటున్నాడు పరమాత్మ. తరువాతి శ్లోకాలలో ఈ సూర్య తేజస్సు, చంద్రుని తేజస్సు, అగ్ని శక్తి ఈ ప్రకృతిలో ఏమేమి పనులు చేస్తున్నాయో, మనకు ఎలా ఉపయోగపడుతున్నాయో వివరంగా తెలియజేసాడు పరమాత్మ.

**13. గామావిశ్య చ భూతాని ధారయామ్యహమోజసా |**
**పుష్ణామి చౌషధీః సర్వాః సోమో భూత్వా రసాత్మకః || ||**

ఓ అర్జునా! ఈ భూమిలో ఉండే ఉత్పాదక శక్తిని నేనే. నేను ఈభూమిలోకి ప్రవేశించి సమస్త ప్రాణి కోటికి ఆధారము అవుతున్నాను. చంద్రుడిగా వెలుగులను విరజిమ్ముతూ ఈభూమినిరసాత్మకంగా అంటే సస్యశ్యామలం చేస్తున్నాను.

అమరనధ్ అమర్

# భగవద్గీత
# పదునైదవ అధ్యాయము
# పురుషోత్తమ ప్రాప్తియోగము



ఓషదులను పండిస్తున్నాను. కేవలం వెలుగు ఉంటే సరిపోదు కదా. వాటిని అనుభవించడానికి జీవరాసులు ఉండాలి కదా. అందుకని పరమాత్మ సూర్యునియొక్క యొక్క తేజస్సు, కాంతి, వేడి రూపంలో, ఈ భూమిలో ప్రవేశించి, జీవరాసులు పుట్టడానికి తగిన బలమును, శక్తిని ఇస్తున్నాడు. జీవరాసులు అన్నీ ఈ భూమి మీద బతరడానికి, తిరగడానికి వారికి ఆహార రూపంలో తగిన శక్తిని ఇస్తున్నాడు. రసాత్మకుడు అయిన చంద్రుడిరూపంలో కిరణములను భూమి మీద ప్రసరింపజేసి, భూమి మీద ఓషధులను, వివిధ రకములైన ధాన్యములను పండించడానికి తగిన ఓజస్సును(బలము, శక్తి) ఇస్తున్నాడు.

ఇప్పటి దాకా అన్నిటిలోనూ నేను ఉన్నాను అంటూ ఇప్పుడుకొంచెం విపులంగా ప్రాణికోటికి శక్తి, బలము నేనే ఇస్తున్నాను. వాటికి ఆహారము నేనే సమకూరుస్తున్నాను. అని అంటున్నాడు. నేటి విజ్ఞాన శాస్త్రం కూడా సూర్యుడే సమస్త జీవకోటికి ప్రాణ శక్తిని ప్రసాదిస్తున్నాడు అని నిరూపించింది. సూర్యుడు లేకపోతే ఈ జీవకోటి మనుగడ సాధ్యం కాదు. సూర్యరశ్మిలో డి విటమిన్ పుష్కలంగా ఉందని మనకు తెలుసు. అలాగే రాత్రి పూట చంద్రుడు ప్రకాశిస్తూ, మన పంటలకు, ఓషధులకు అవసరమైన శక్తిని, బలాన్ని ఇస్తున్నాడు. శరీరానికి, మనసుకు, సంతోషాన్ని ఆహ్లాదాన్ని, కలుగజేస్తున్నాడు.

సూర్యుడు చంద్రుడు, అగ్ని బాహ్య ప్రపంచంలో మనకు ఎలా ఉపయోగపడతారో తెలియజేప్పాడు కృష్ణుడు, ఇంక ఆంతరంగికంగా అంటే మన శరీరం లోపల, అగ్ని ఏ రూపంలో ఈ జీవకోటికి ఎలా ఉపయోగపడతాడో తరువాతి శ్లోకంలో వివరించాడు కృష్ణుడు.

**14. అహం వైశ్వానరో భూత్వా ప్రాణినాం దేహమాశ్రితః |**
**ప్రాణాపానసమాయుక్తః పచామ్యన్నం చతుర్విధమ్ || ||**

ఓ అర్జునా! నేను వైశ్వానరుడుఅనే అగ్నిరూపంలో ప్రాణుల శరీరంలో ఉంటూ, వారి శరీరాలికు కావలిసిన వేడిని ఇస్తూ, వారుతిన్న నాలుగు విధములైన ఆహారములనుపచనంచేస్తున్నాను అంటే జీర్ణం చేస్తున్నాను.

సూర్యుడి వెలుగు, చంద్రుడి వెలుగు అన్నీ బయట ప్రపంచాన్ని చూడటానికి పనికి వస్తాయి. ఆహారధాన్యాలను ఓషధులను పండిస్తాయి. మూడవది అగ్ని. ఈ అగ్ని రెండు విధాలు మొదటివి బయట ఉండే అగ్ని, రెండవది అన్ని వస్తువులలో, పదార్థాలలో, భావాలలో అంతర్లీనంగా ఉండే అగ్ని. ప్రతి వస్తువులో అగ్ని అంతర్లీనంగా ఉంటుంది. రెండు వస్తువులు రుద్దుకుంటే వేడి పుడుతుంది. రాయి, ఇనుము లాంటివి రాచుకుంటే అగ్నికణాలు పుడతాయి. అలాగే భావాలలో కూడా అగ్ని ఉంటుంది. కామాగ్ని, కోపాగ్గి అని కూడా అంటుంటాము.

అమరనధ్ అమర్

# భగవద్గీత
# పదునైదవ అధ్యాయము
# పురుషోత్తమ ప్రాప్తియోగము



ప్రస్తుతం కృష్ణుడు శరీరంలో అంతర్లీనంగా ఉంటే శరీర ఉష్ణోగ్రత, కడుపులో ఉండే జఠరాగ్నిని గురించి చెబుతున్నాడు. ప్రతి శరీరంలో కూడా పరిమితంగా ఉష్ణోగ్రత ఉంటుంది. మానవ శరీరంలో 98.4 డిగ్రీల ఉష్ణోగ్త నిలకడగా ఉంటుంది. అది హెచ్చినా, తగ్గినా ప్రమాదమే. అలాగే జీవరాసులు, మానవులు అన్నీ తాము ప్రాణాలతో ఉండటానికి ఏదో ఒక ఆహారం తినాలి. తిన్న ఆహారం జీర్ణం కావాలి కదా. అది ఎలా జరుగుతుందో ఈ శ్లోకంలో వివరిస్తున్నాడు పరమాత్మ.

బయటే కాదు నేను జీవరాసులలో లోపల కూడా అగ్ని రూపంలో ఉంటాను. దానినే వైశ్వానరుడు అంటారు. అదే జఠరాగ్ని, ఈ జఠరాగ్ని మనం తిన్న నాలుగు రకాల ఆహారములను జీర్ణం చేస్తుంది. ఆ జఠరాగ్ని రూపంలో ఉన్న అగ్నిని నేనే అంటున్నాడు పరమాత్మ. అందుకే 'ప్రాణినాం దేహమాశ్రిత: అన్నాడు. అంటే ప్రతి ప్రాణి దేవములో జఠరాగ్ని రూపంలో నేనే ఉన్నాను.

పచామ్యన్నం చతుర్విధం అంటే నాలుగు రకములైన ఆహార పదార్ధములను పచనం చేస్తున్నాను. అన్నం అంటే ఆహారము. కేవలము వరి అన్నమే కాదు. బియ్యముతో గానీ మరి ఏ ఇతర ధాన్యములతో గానీ పప్పు పదార్థములతోగానీ నాలుగు రకములైన ఆహార పదార్థములను తయారు చేస్తారు. వాటినే భక్ష్యములు, ధోజ్యములు, లేహ్యములు, చోప్యములు. భక్ష్యములు అంటే గట్టిగా ఉండి కొరికి నమిలి తినే పదార్ధములు. కూరలు, పిండి వంటలు భోజ్యములు అంటే నాలుకతో చప్పరించేవి. మెత్తగా ఉండేవి. లేహ్యములు అంటే నాలుక మీద వేసుకొని లొట్టలేసేవి. పచ్చళ్లు, హల్వాలు మొదలగు పల్చటి, మెత్తటి పదార్థాలు. చోష్యములు అంటే పానీయాలు. నోటితో జుర్రుకునే పల్లటి పదార్థాలు, వివిధరకములైన పానీయాలు. మనం రోజూ తినేవి అన్నీ ఈ నాలుగింటిలో ఏదో ఒక రకమునకు చెందినవి అయి ఉంటావి. ఈ ఆహార పదార్ధములను మనం నోటితో తింటాము. అవి గొంతు గుండా జీర్ణాశయములోకి వెళతాయి. ఇక్కడ ఒక విషయం మనం గుర్తుపెట్టుకోవాలి. గొంతు దాకా మన ఇష్టం. ఏది తనాలి ఏది తనకూడదు అని మనం నిర్ణయించుకుంటాను. ఒక సారి గొంతుదిగితే తరువాత వైశ్వానరుడి ఇష్టం. నువ్వు పాయసం తిన్నా, విషం తిన్నా తన పని తాను చేసుకుపోతాడు. ఆ వైశ్వానరుడే జఠరాగ్ని, మనం తిన్న అన్నిపదార్థాలను వివిధ రసములతో కలిపి జీర్ణం చేసే అగ్ని లాంటి శక్తి. దానినే జీర్ణశక్తి అని కూడా అుటారు.

ఇక్కడ మరొక విషయం కూడా చెప్పాడు కృష్ణుడు. "ప్రాణాపాన సమాయుక్త:" అంటే ప్రాణము, అపానముతో కూడినది. లోపల ఉండే జఠరాగ్ని బాగా ప్రజ్వరిల్లాలంటే గాలి కావాలి కదా. ఆదే మనం పీల్చే గాలి, వబలే గాలి, ఉచ్ఛ్వాస నిశ్వాసముల ద్వారా ప్రాణవాయువును పీల్చి, వదులుతుంటాను.


అమరనధ్ అమర్

# భగవద్గీత
# పదునైదవ అధ్యాయము
# పురుషోత్తమ ప్రాప్తియోగము



ఈ ప్రాణవాయువు లోపల ఉన్న అగ్నికి శక్తిని ఇస్తుంది. ఆ శక్తి వలన జఠరాగ్ని మనం తిన్న నాలుగు విధములైన ఆహార పదార్థములను జీర్ణం చేస్తుంది.

అందుకే అన్నం తినేటప్పుడు ఒక మంత్రం చదువుతారు. ముందు గాయత్రి మంత్రం చదువుతారు. తరువాత "అమృతమస్తు' అని తను తినబోయేఆహారం అమృతంతో సమానం కావాలి అని సంకల్పిస్తాడు. తరువాత "ఓం ప్రాణాయస్వాహా, అపానాయస్వాహా, వ్యానాయస్వాహా, ఉదానాయస్వాహా, సమానాయ స్వాహా అని తరువాత ఓం పరబ్రహ్మణే నమ:" అంటూ భగవంతుడిని తలంచుకొని భోజనం ప్రారంభిస్తాడు. ఈ ఆహారం అంతా ఆ పరబ్రహ్మ స్వరూపము (అన్నం పరబ్రహ్మ స్వరూపము) ఆయనకు నమస్కారము. నాఆహారమును సక్రమంగా జీర్ణం చేసి నాకు శక్తిని ప్రసాదించు అని సంకతల్పించి భోజనానికి ఉపక్రమిస్తాడు. ఈ శాస్త్రీయ విధానము అంతా ఈశ్లోకంలో వివరించాడు పరమాత్మ.











Editing
C. AMARANATH AMAR
AMR
సవరణ
అమరనాథ్ అమర్

# భగవద్గీత
# పదునైదవ అధ్యాయము
# పురుషోత్తమ ప్రాప్తియోగము



**15. సర్వస్య చాహం హృది సన్నివిష్టో మత్తః స్మృతిర్జ్ఞానమపోహనం చ |
వేదైశ్చ సర్వైరహమేవ వేద్యో వేదాంతకృద్వేదవిదేవ చాహమ్ || ||**

ఓ అర్జునా! నేను అందరి హృదయాలలో ఆత్మస్వరూపుడుగా ఉన్నాను. నా వలననే మానవులకు జ్ఞాపక శక్తి, జ్ఞాన శక్తి, ధారణ శక్తి మరిచిపోయే శక్తి కలుగుతున్నాయి. నాకు వేదములు తెలుసు. నేను వేదస్వరూపుడను. వేదముల గురించి తెలిసిన వాడను కూడా నేనే". పైన చెప్పబడిన శ్లోకంలో, మనం తిన్న ఆహారం జీర్ణం అయి ఎలా మనకు శక్తిని ఇస్తుంది అనే విషయం చెప్పిన తరువాత ఆ శక్తి ఎలా పని చేస్తుంది అనే విషయాన్ని ఈ శ్లోకంలో వివరిస్తున్నాడు.

మనం తిన్న ఆహారం వలన వచ్చిన శక్తి మనకు స్మృతి అంటే జ్ఞాపక శక్తి, ధారణా శక్తి, అవగాహనా, ఆలోచనా శక్తిని ఇస్తుంది. అలాగే అపోహనం అంటే మరచిపోయే శక్తిని కూడాఇస్తుంది. అపోహ అని వాడాడు పరమాత్మ, అపోహలు అని మనం వింటూ ఉంటాము. విషయాలను తప్పుగా అర్థం చేసుకోవడం అంటే మనం తినే ఆహారాన్ని బట్టి మనకు చురుకుదనం, జ్ఞాపక-శక్తి కలుగుతాయి అలాగే అపోహలు, మతిమరుపు, చదివింది జ్ఞాపకం లేకపోవడం కలుగుతాయి. వీటి కంతా కారణం మన హృదయం లోపల ఉండి మనలో చైతన్య శక్తిని కలుగచేస్తున్న పరమాత్మ.

ఇది ఏ ఒక్కరికో ఏ జాతికో, కులానికో, ధనికులకో, అగ్రవర్ణాల వారికో పరిమితం కాదు. "సర్వస్య అంటున్నాడు. అంటే అందరికీ సమానంగా వర్తిస్తుంది. బ్రాహ్మణులకే తెలివితేటలు ఉంటాయి. ఒక ప్రాంతం వారికే తెలివి తేటలు ఉంటాయి అని అనుకోవడం పొరపాటు. అది మనం చూపే వివక్షత, తినే ఆహారం, వాతావరణం, పరిసరాలు, పూర్వజన్మవాసనలు, మనోనిర్మలత్వం, దార్మిక భానవలు, ధార్మిక జీవనం అన్నిటినీ మించి దైవబలం ఇవన్నీ ఒకవ్మక్తి యొక్క తెలివిని, ధారణా శక్తిని, మతి మరుపును నిర్ణయిస్తాయి. మనలను పరమాత్మ మన హృదయం లో ఉండి చూస్తున్నాడు. అనే విషయాన్ని మనం నిరంతరం గుర్తుపెట్టుకోవాలి. అప్పుడే ఎటువంటి అకృత్యాలకు పాలుపడే అవకాశం ఉండదు. జ్ఞాపక శక్తి, ధారణా శక్తి, జ్ఞాన శక్తి, మతిమరుపు, అపోహలు, ఇవన్నీ మనోవికారాలు. మనం తినే ఆహారాన్ని బట్టి ఇవి మనకు సంక్రమిస్తాయి.

వీటి వలన ఏం జరుగుతుంది అంటే తెలుసుకోదగిన వాటిని తెలుసుకుంటాము. వేదము అంటే తెలుసుకోతగినది. ఆ వేదములలో తెలుసుకోదగినది పరమాత్మ స్వరూపము. అదినేనే అంటున్నాడు. వేదములు చదువుకున్నందుకు ఫలితం పరమాత్మ తత్వమును గురించి తెలుసుకోవడం, ఎందు కంటే పరమాత్మ నుండి పుట్టిన వేదములు పరమాత్మను గురించి పరమాత్మ స్వరూపమును గురించి తెలియజేస్తాయి.

అమరనథ్ అమర్

# భగవద్గీత
# పదునైదవ అధ్యాయము
# పురుషోత్తమ ప్రాప్తియోగము



పరమాత్మను గురించి పరమాత్మ తత్వమును గురించి వేదములకు బాగా తెలుసు. వేదములను కేవలం యాంత్రికంగా వల్లెవేయకుండా వాటిలో దాగి ఉన్న అసలు అర్థాన్ని తెలుసుకోడానికి ప్రయత్నం చేయాలి. అప్పుడే వేదవిదుడు, వేద పండితుడు అనే మట సార్థకం అవుతుంది. "వేదాన్తకృన్' అంటే ఈ వేదములు నా చేత సృష్టింపబడినవి అంటే నిరాకారుడైన పరమాత్మ సాకారుడై వచ్చి రాసాడు అని కాదు. పరమాత్మ అందరి హృదయాలలో ఉన్నాడు అని ఇప్పుడే చెప్పుకున్నాము. ఋగ్వేదములో మొదటి అనువాకము మధుచ్ఛందసుడు అనే ఋషి చెప్పాడు. తరువాత లిపిబద్ధం అయింది. ఋగ్వేద ఋషులు తాము సమాధిలో ఉన్నపుడు పరమాత్మ కృపతో కలిగిన జ్ఞానం ద్వారా తెలుసుకున్న విషయాలను, జ్ఞాపకం పెట్టుకొని, తమ శిష్యులకు చెప్పారు. గురుశిష్య పరంపరగా వేదములు తరతరాలుగా ఒకరి నుండి ఒకరికి మౌఖికంగా అందించబడ్డాయి. అందుకే ఈ శ్లోకంలో "వేదాంతకృతో' అంటే ఈ వేదములు, వేదాంతములు అంటే ఉపనిషత్తులు మొదలైన వాటిని గొప్పవారైన మహా ఋషుల యొక్క స్మృతిపథం లోకి ప్రవేశపెట్టి వారిచేత పలికించిన వాడిని నేనే. ఆ మహాఋషుల యొక్క జ్ఞాపక శక్తిని, ధారణా శక్తిని, ఆలోచనా శక్తిని, పరిశీలనా శక్తిని నేనే. వేదస్వరూపాన్నినేనే అంతేకాదు, ఈ వేదములను సృష్టించిన వాడిని నేను, ఆ వేదములను ఎరిగిన వాడిని కూడా నేనే అని కృష్ణుడు ఇక్కడ చెప్పాడు. కాబట్టి, సర్వం పరమాత్మ మయం అని తెలుసుకుంటే చాలు. అందుకే వేదములు అపౌరుషేయములు, పరమాత్మచే సృష్టించబడ్డాయి అని పెద్దలు అంటారు.

16. ద్వావిమౌ పురుషౌ లోకే క్షరశ్చాక్షర ఏవ చ |
క్షరః సర్వాణి భూతాని కూటస్థోఽక్షర ఉచ్యతే || ||

ఈ లోకములో ఇద్దరుపురుషులు ఉన్నారు. వారు క్షరుడు, అక్షరుడు. దేహాభిమానము కలవాడిని క్షరుడు అంటారు. దేహములో ఉన్న ఆత్మ స్వరూపాన్ని అక్షరుడు అని అంటారు. ఈ అధ్యాయము పేరు పురుషోత్తమ యోగము అని అంటారు .అసలు పురుషోత్తములు ఎవరు అనే విషయాన్ని గురించి ఇక్కడి నుండి వివరించాడు కృష్ణపరమాత్మ. ఆ విషయాల గురించి ఇప్పుడు మనం తెలుసుకుందాము. మనకు కనిపించే ప్రకృతి గురించి మనకుతెలుసు. మన శరీరం కూడా ఆ ప్రకృతిలో ఒక భాగము. ఈ ప్రకృతి ఒక్కోసారి కనపడకుండా పోతుంది. ఈ రోజు ఉన్న చెట్టు కొన్నాళ్ల తరువాత కనిపించదు. ఈ రోజు ఉన్న శరీరము కొంత కాలము తరువాత కనిపించదు. అంటే మార్పు చెందుతుంది. కనపడకుండా పోతుంది. దానినే అవ్యక్తము, కంటికి కనిపించదు అని అంటారు. అంటే మరొక రూపంలోకిమారి పోతుంది . దీనినే మనం నశించడం అని కూడా అంటుంటాము. నశించడం అంటేకనపడకుండా పోవడం, మరొక రూపంలో ఉండటం.

అమరనధ్ అమర్

# భగవద్గీత
# పదునైదవ అధ్యాయము
# పురుషోత్తమ ప్రాప్తియోగము



ఉదాహరణకు మొదట చిన్న బీజంగా ఉన్నది నేలలో పాతితే మొక్క, మాను అయి పెద్దవృక్షము అవుతుంది. దానినుండి అనేక బీజములు పుడతాయి. తరువాత చెట్టు ఎండి పోయి నశించినా అంటే కనపడకుండా పోయినా, బీజరూపంలో నిక్షిప్తము అయి ఉంటుంది. మనకు కంటికి కనిపించే ప్రకృతిని, మార్పు చెందే ప్రకృతిని క్షరము అనీ, అవ్యక్తముగా, బీజరూపంలో, సూక్ష్మరూపంలో ఉన్న ప్రకృతిని అక్షరము అని అనుకోవాలి. ఈ క్షర, అక్షరముల వెనుక చైతన్యం ఒకటి ఉంది. ఆ చైతన్యమే వీటిలన్నిటికీ జీవశక్తిని, చేతనత్వమును ఇస్తుంది. దానినే పురుషోత్తముడు పరమాత్మ అని అంటారు. వ్యక్తము, అవ్యక్తము అయిన ప్రకృతికి చేతనత్వము లేదు. జడమూఉదాహరణకు మనకు కళ్లు ముక్కు, చెవులు ఉన్నా లోపల జీవశక్తి, చేతనత్వము లేకపోతే అవి ఉన్నా పనిచేయవు. దానినే మరణము అని అంటారు. కాబట్టి ఈ ప్రకృతి అంతా జడము. జీవము లేనిది దానికి చేతనత్వాన్ని, జీవాన్ని ప్రసాదించేవాడు పురుషోత్తముడు, పరమాత్మ, విశ్వచైనన్యము. ఉదాహరణకు సూర్యుడుతన వెలుగును చంద్రుడిమీద ప్రసరిస్తే, ఆ ప్రతిబింబ కాంతిలో మనం ఈ విశ్వాన్ని చూస్తున్నాము. సూర్యుడి కాంతి లేకపోతే చంద్రుడు జడము. అలాగే పరమాత్మ యొక్క చైతన్యముతోనే ర జడమైన క్షర అక్షర ప్రకృతి చైతన్యవంతము అవుతూ ఉంది. ఈ విషయాన్నే ఈ శ్లోకంలో వివరించాడు పరమాత్మ.

లోకంలో క్షర. అక్షర అనే ఇద్దరు పురుషులు ఉన్నారు. ఈ లోకంలో ఉన్న చరాచర భూతకోటి అంటే వ్యక్త పదార్థము (కంటికి కనపడే పదార్థము) అంతా క్షర పురుషుడు అయితే వాటిలో అంతర్లీనంగా, అవ్యక్తంగా (కంటికి కనపడకుండా) ఉన్న అవ్యక్త పదార్థము అక్షర పురుషుడు అని అంటారు. ఈ రెండింటికీ జీవశక్తిని అంటే కదిలే శక్తిని ఇచ్చేదే విశ్వ చైతన్యము. దానినే పురుషోత్తముడు, భగవంతుడు, పరమాత్మ అని మనం పిలుచుకుంటున్నాము.

17. ఉత్తమః పురుషస్త్వన్యః పరమాత్మేత్యుధాహృతః |
యో లోకత్రయమావిశ్య బిభర్త్యవ్యయ ఈశ్వరః || ||

ఎవరైతే ఈ మూడులోకములలో చైతన్యరూపుడుగా ప్రవేశించి, అంతటా నిండి ఉన్నాడో, ఆ లోకములను భరిస్తున్నాడో, అటువంటి అవ్యయుడు, సకల జగత్తుకు ఈశ్వరుడు, క్షీర అక్షరముల కంటే వేరైనవాడు, అయిన పురుషడిని పురుషోత్తముడు, పరమాత్మ అని చెప్పబడతాడు.

పై శ్లోకములో చెప్పబడిన క్షరము, అక్షరముల కంటే అన్యమైనది అంటే వేరైనది మరొకటి ఉంది. దానినే ఉత్తమ పురుషుడు, పరమాత్మ అని అంటారు. ఈ పరమాత్మ తత్వము మూడు లోకములలో ఆవరించి, నిండి ఉంటుంది. అన్ని లోకములకు చైతన్యశక్తిన ప్రసాదిస్తూ వాటిని భరిస్తూ ఉంటుంది. ఆ పురుషోత్తముడిని, పరమాత్మను విశ్వచైతన్యము అంటారు. ఈ పరమాత్మ తత్వము అవ్యయము అంటే నాశము, మార్పులేనిది ఎప్పటికీ నిలిచి ఉండేది.

అమరనాథ అమర్

# భగవద్గీత
# పదునైదవ అధ్యాయము
# పురుషోత్తమ ప్రాప్తియోగము



దేనిమీదా ఆధారపడనిదీ, స్వతంత్రప్రతిపత్తి కలది. అని పరమాత్మ లక్షణములనువివరించాడు కృష్ణభగవానుడు.

18. యస్మాత్క్షరమతీతోఽహమక్షరాదపి చోత్తమః |
అతోఽస్మి లోకే వేదే చ ప్రథితః పురుషోత్తమః || ||

క్షరపురుషుడు కంటే అతీతుడు, అక్షర పురుషుడు కంటే ఉత్తముడు, అయినందు వలన నేను మూడులోకములలోనూ, వేదములలోనూ పురుషోత్తముడుగా ప్రశిద్ధి చెందాను. అంటేమూడులోకములలో ఉన్న బుద్ధిమంతులు, వేదములు అధ్యయనం చేసి జ్ఞానమును ఆర్జించిన జ్ఞానులు, నన్ను పురుషోత్తముడు అని అంటారు.

ఇక్కడ నేను అంటే కృష్ణుడు అని కాదు. కృష్ణుడి శరీరము కూడా క్షరమే. కాని కృష్ణుడి లో ఉన్న ఆత్మస్వరూపము, చైతన్యము పురుషోత్తమ స్వరూపము. మనలో కూడా పరమాత్మ ఆత్మస్వరూపుడుగాఉన్నాడు. ఆ విషయం కృష్ణుడు తెలుసుకున్నాడు. మనకు తెలియదు. ఈవిషయం తెలియాలంటే మనకు బుద్ధి జ్ఞానము కలగాలి. దానికి వేదాధ్యయనము, శాస్త్రపఠనము, గురుకృప ముఖ్యము.

19. యో మామేవమసంమూఢో జానాతి పురుషోత్తమమ్ |
స సర్వవిద్భజతి మాం సర్వభావేన భారత || ||

ఎవరైతే జ్ఞానవంతుడై నన్ను పురుషోత్తముడు అని తెలుసుకుంటాడో, అతడు సమస్తమును తెలిసినవాడు. అతడికి తెలియూయాల్సినది అంటూ ఏమీ ఉండదు. అతడు నన్ను నిర్మలమైన మనస్సుతో భజిస్తాడు, ఆరాధిస్తాడు.

ఈ శ్లోకంలో ఒక విచిత్రమైన పదం వాడారు. "అసమ్మూఢ" మూఢుడు అంటే మనకు తెలుసు మూర్ఖు,డు. వాడికి తెలియదు. ఒకరు చెబితే వినడు. తనకు ఏం తోస్తే అది చేస్తాడు. అన్నీ తప్పుడు నిర్ణయాలు తీసుకుంటాడు. సరి అయిన మార్గంలో నడవడు. తాను నమ్మిందే సిద్ధాంతం, తాను చెప్పిందే వేదంఅంటాడు. వీడి పేరు మూఢుడు. మూర్ఖుడు. ఈ మూడులలో గొప్ప వాడు సమ్మూడుడు. అంటే ఈ లక్షణాలన్నీ పరాకాష్టకు చేరుకున్న వాడు. ఈ లక్షణాలు లేని వాడు అసమ్మూడుడు. అంటే మంచి వాడు అని అర్థం. ఆ మాత్రం దానికి మంచి వాడు అని చెప్పవచ్చుకదా అని సందేహం రావచ్చు. మనకు ఎటువంటి లక్షణాలు ఉండకూడదో ముందు చెప్పి, అవి లేని వాడు మంచి వాడు అని చెప్పడం వ్యాసులవారి ప్రత్యేకత.

అటువంటి అసమ్మూఢులు అంటే జ్ఞానులు, అన్నీ తెలిసిన వారు, నన్ను పురుషోత్తముడుగా తెలుసుకుంటారు. దేహము వేరు తాను వేరు అనుకుంటారు. ఆత్మజ్ఞానము పూర్తిగా కలిగి ఉంటారు. అటువంటి వారికి ఇంక తెలుసుకోదగ్గది ఏమీ ఉండదు.

# భగవద్గీత
# పదునైదవ అధ్యాయము
# పురుషోత్తమ ప్రాప్తియోగము



అటువంటి వారు నిర్మలమైన, నిష్కల్మషమైన, స్థిరమై, అచంచలమైన మనస్సుతో నన్ను పూజిస్తారు, ఉపాసిస్తారు. అందుకే "సర్వభావేన' అని అన్నారు. అంటే ఈ ప్రపంచం అంతా పరమాత్మ మయం, సర్వం ఆ పరమాత్మయే, అణువణువు పరమాత్మ స్వరూపమే అనే భావనతో ఏకాగ్రచిత్తంతో ఉపాసిస్తారు. వారికి బయట పప్రపంచం లో దొరికే వస్తువుల మీద ఎటువంటి ఆసక్తి ఉండదు. ఒక వేళ ఉన్నా పరిమితంగా కావలసినంతవరకే ఉంటుంది. బాహ్యప్రపంచములో దొరికే పదార్థములు, వస్తువులు అన్నీ అశాశ్వతములు అని తెలుసుకుంటాడు అప్పుడు అతని మనసు ఆత్మయందు స్థిరమై ఉంటుంది. మనస్సు ఎల్లప్పుడూ పరమాత్మనే ధ్యానిస్తూ ఉంటుంది. అతనికిమరొక ఆలోచన ఉండదు.

ఈ స్థితికి రావాలంటే ప్రతి మానవుడు క్షరము, అక్షరము, పరమాత్మ (పురుషోత్తముడు) వీరి గురించిన జ్ఞానము క్షుణ్ణంగా కలిగిఉండాలి. అదే ప్రపంచములో ఉన్న విద్యలకెల్లా గొప్ప విద్య, ఏకీకృతమైన భావముతో పరమాత్మను ధ్యానించాలి. మరే ఇతర భావమును మనసులోకి రానీయకూడదు. పరమాత్మమీద పరిపూర్ణమైన, అనన్యమైన, ఏరాగ్రమైన భక్తి విశ్వాసము కలిగి ఉండాలి. భక్తి భావము, ఒకటి గా ఉండాలి. పరమాత్మ యందు భక్తి, ప్రాపంచిక విషయాల మీద భావానురక్తి కలిగి ఉండకూడదు. దానిని అనన్య భక్తి ఏకాగ్రభక్తి అనరు. ఇదిఒకరోజులో సాధ్యమయ్యేపని కాదు. నిరంతర అభ్యాసము సాధన అవసరము. దానిని మనం ఈరోజునుండేమొదలుపెట్టాలి. ప్రయత్నం చేయాలి. ఈ జన్మలో కాకపోయినా తరువాత జన్మలలోనైన ఫలిస్తుంది అని పరమాత్మ స్వరూపుడు అయిన కృష్ణుడు మనకు హామీ ఇస్తున్నాడు.

**20. ఇతి గుహ్యతమం శాస్త్రమిదముక్తం మయానఘ |**
**ఏతద్బుద్ధ్వా బుద్ధిమాన్స్యాత్కృతకృత్యశ్చ భారత || ||**

ఓ అర్జునా! ఇప్పటి దాకా నీకు నేను చెప్పిన శాస్త్రము అతి రహస్యము. నీ మీద నాకు ఉన్న వాత్సల్యముతో నేను నీకు ఉపదేశించాను ఈ శాస్త్రములో చెప్పబడిన విషయాలన్నీ తెలుసుకొని అర్థం చేసుకొని, ఆకళింపు చేసుకొని, ప్రవర్తించు. నీకు జ్ఞానం లభిస్తుంది. సమస్తకార్యములలో నీవు కృతకృత్యుడవు అవుతావు. అని పరమాత్మ గీతాశాగ్త్రమును ముగించాడు. ఈ గీతాశాస్త్ర ము అతి రహస్యము అని అన్నాడు కృష్ణుడు. అంటే ఇది అందరికీ సామాన్యంగా అర్థం కాదు. చాలా కష్టతరమైనది. లోతుగా పరిశీలిస్తేనే గానీ మనసుకు ఎక్కదు ఈ గీతను అర్జునుడికే ఎందుకు చెప్పాడు. "కృష్ణా! నాకు దిక్కుతోచడం లేదు, ఏమి చెయ్యాలో అర్థం కావడం లేదు, నన్ను నీ శిష్యుడిగా స్వీకరించి నాకు ఉత్తమమైన మార్గము ఉపదేశించు" అని రెండవ అధ్యాయంలో అర్జునుడు అడిగాడు కాబట్టి చెప్పాడు.

అమరనాథ్ అమర్

# భగవద్గీత
# పదునైదవ అధ్యాయము
# పురుషోత్తమ ప్రాప్తియోగము



ఈ శ్లోకంలో అర్జునుడిని కృష్ణుడు "అనఘా!" అంటే ఏ పాపము అంటని వాడా అని సంబోధించాడు. నీలో కేవలు విషాదము అంకురించిందే కానీ నీకు ఏపాపము అంటలేదు కాబట్టి నీకు ఈ గీతాబోధ చేసాను అని అన్నాడు పరమాత్మ. ఈ గీతాశాస్త్ర ము గురించి తెలుసుకున్న వాడు జ్ఞానవంతుడు అంటే ఆత్మజ్ఞానము కలవాడు అవుతాడు. రెండది కృతకృత్యుడు అవుతాడు. ఈ గీతను వినినందువలన, అర్థం చేసుకున్నందువలన, ఆత్మ, పరమాత్మ వీటి స్వరూపములు స్వభావముల గురించిన జ్ఞానం కలుగుతుంది. పరమాత్మను ఎలా చేరుకోవాలి అన్న విషయం అర్థం అవుతుంది. దానికి మార్గం ఏమిటో బోధపడుతుంది. పరమాత్మను చేరుకోవడానికి ఏయే అవరోధాలు ఉన్నాయో వాటిని ఎలా దాటాలో కూడా తెలుసుకోగలుడుతాడు. బ్రహ్మ జ్ఞానమునుపొందుతాడు.

ఇంక "కృతకృత్యుడు" అంటే పైవన్నీ తెలుసుకోవడంలో కృత చక్కగా చేయబడిన కర్మలు కలవాడు అవుతాడు అంటే ఏ అత్మజ్ఞానం పొందడానికి ఈ భగవద్గీతను అధ్యయనం చేసాడో, ఆ పనిలో కృతకృత్యుడు అవుతాడు. దాని ఫలితమును చక్కగా పొందగలుగుతాడు. కాబట్టి నీవు కూడా ఈ గీతను చక్కగా, శ్రద్ధతో, భక్తితో, ఒక శిష్యుడిగా విన్నావు కాబట్టి నీకు బుద్ధి, జ్ఞానము కలుగుతుంది .నీవు సకల కార్యములలో కృతకృత్యుడివి అవుతావు. నీలోని విషాదము అంతరిస్తుంది. నీ కర్తవ్యమును నీవు నిర్వర్తిస్తావు. నీ స్వభావము అయిన క్షత్రియధర్మమును పాటించి యుద్ధం చేస్తావు. అని పరమాత్మ గీతను ముగించాడు.

ఒక విధంగా చూస్తే, ఈ అధ్యాయంతో భగవద్గీత పూర్తిఅయింది. కానీ తరువాతి మూడు అధ్యాయాలలో కొన్ని వివరణలు ఇచ్చాడు. ధైవీ సంపద. ఆసురీ సంపదలను గురించి మూడు రకములైన శ్రద్ధల గురించి, మోక్షము అంటే ఏమిటి, సన్యాసము అంటే ఏమిటి వాటి వివరణలు ఇచ్చాడు. ఇవి అన్నీ ఈ 15 అధ్యాయాలలో చెప్పినవే అయినా వాటిని ఇంకా వివరంగా చెప్పాడు.


మనలో ఉన్న ధైవీ సంపదలను వెంపెంపొందించుకొని, ఆసురి సంపదలనువిడిచిపెట్టాలంటే వాటి గురించి తెలుసుకోవాలి కదా! అలాగే పరమాత్మమీద భక్తి కలిగి ఉండాలంటే శ్రద్ధ అవసరము. ఆ శ్రద్ధ, దాని రకాల గురించి తెలుసుకోవాలి కదా! అలాగే మోక్షము, సన్యాసము అనే పదాలు ఈ 15 అధ్యాయాలలో వాడబడ్డాయి కాని వాటి అర్థం తెలుసుకోవాలి కదా! అందుకని 16,17,18 ఈ మూడు అధ్యాయాలలో వాటి గురించి ఇంకా ఈ 15 అధ్యాయాలలో చెప్పకుండా మిగిలిన వాటి గురించి చక్కగా వివరించారు. వాటి గురించి కూడా మనం తెలుసుకోడానికి ప్రయత్నం చేద్దాం.

అమరనధ్ అమర్

# భగవద్గీత
# పదునైదవ అధ్యాయము
# పురుషోత్తమ ప్రాప్తియోగము



ఉపనిషత్తులయొక్క బ్రహ్మవిద్యయొక్క
యోగశాస్త్రము యొక్క సారమలియిన భగవద్గీతలో, పదునైదవ ఆధ్యాయము
పురుషోత్తమప్రాప్తి యోగము సంపూర్ణము
ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత.








Editing
C. AMARANATH AMAR
AMR
సవరణ
అమరనాథ్ అమర్

www.sanatanadharm.com

సనాతన ధర్మ గ్రంథాలను ప్రతి ఒక్కరికి చేరువ చేసేందుకు అమర్నాథ్ ఆధ్వర్యంలో వెబ్ సైట్ ప్రారంభించడం జరిగింది. ఇందులో హిందూ ధర్మానికి చెందిన అన్ని గ్రంథాల సమాచారం ఉంటుంది. మన గ్రంథాల్లోని ప్రతి విషయాన్ని విపులంగా వివరిస్తూ.. అందరికి అర్థమయ్యే విధంగా తయారు చేయడం జరిగింది. అనేక గ్రంథాలను చదివి.. అందరికి అర్థమయ్యే రీతిలో దీనిని రాయడం జరిగింది. మీరందరు ఆదరిస్తారని, ఆశిస్తున్న, ఇట్లు మీ అమర్నాథ్ అమర్ .........

అమరనధ్ అమర్